నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 6-8-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 4 | పేజీలు:4 | వెల: రూ.1/-

41 ఏళ్ల నిరీక్షణకు తెర.. మెన్స్ హాకీలో భారత్‌కు కాంస్య పతకం

టోక్యో, ఆగష్టు 5:ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు అద్భుతమైన విజయాన్ని నమోదు చేసి.. కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నది. 1980 తర్వాత ఒలింపిక్స్ పతకాన్ని సాధించింది. ఆ సంవత్సరంలో స్వర్ణ పతకం గెలువగా.. ఆ తర్వాత పతకం గెలువడం ఇదే తొలిసారి. బుధవారం జర్మనీతో కాంస్య పతకం కోసం జరిగిన మ్యాచ్‌లో భారత క్రీడాకారులు సత్తా చాటారు. బలమైన ప్రత్యర్థిని భారత్ 5-4 తేడాతో చిత్తు చేసింది. 41 సంవత్సరాల సుదీర్ఘ విరామం అనంతరం పతకాన్ని సాధించి ఎన్నో ఏళ్ల కలను సాకారం చేసింది. మ్యాచ్‌లో రెండు, మూడు క్వార్టర్స్‌లో భారత స్ట్రయికర్లు సత్తా చాటగా.. ఆఖరి క్వార్టర్‌లో జర్మనీ క్రీడాకారులు దూకుడు ప్రదర్శించినా.. డిఫెండర్లు, గోల్ కీపర్ సమర్థవంతంగా అడ్డుకున్నారు. పలు పెనాల్టీ కార్నర్లను గోల్ కాకుండా అడ్డుకొని ఒలింపిక్ పతకాన్ని ఒడిసిపట్టారు.

వెనుకబడినా.. పుంజుకొని..

మ్యాచ్‌లో మొదటి క్వార్టర్‌లో 0-1 గోల్స్‌తో భారత జట్టు వెనుకపడింది. రెండో క్వార్టర్‌లో సిమ్రన్ జీత్ ఒక గోల్ సాధించి.. స్కోరును 1-1 సమమం చేశాడు. ఆ తర్వాత జర్మనీ ఆటగాళ్లు రెండు గోల్స్ చేసి ఆధిక్యాన్ని 3-1 పెంచుకున్నారు. హర్దిక్ సింగ్, హర్మన్ ప్రీత్ చెరో గోల్ సాధించగా.. 3-3తో సమం చేశారు. మూడోక్వార్టర్‌లో జర్మనీపై భారత్ పూర్తిగా ఆధిపత్యం చెలాయించింది. ఇందులో భారత్ రెండు గోల్స్ సాధించింది. రూపిందర్ పాల్ నాలుగో గోల్ సాధించగా.. సిమ్రన్ జిత్ ఐదో గోల్ వేసి.. 5-3కు పెంచాడు.

మూడో క్వార్టర్ ముగిసే వరకు భారత్ 5-3తో ఆధిక్యంలో ఉంది. అయితే నాలుగో క్వార్టర్‌లో జర్మనీ గోల్ సాధించి ఆధిక్యాన్ని 5-4కు తగ్గించింది. స్కోర్‌ను సమం చేసేందుకు జర్మనీ ఎంత ప్రయత్నించినా భారత ఆటగాళ్లు అవకాశం ఇవ్వలేదు. రెండు, మూడు క్వార్టర్స్‌లో భారత స్ట్రయికర్లు సత్తా చాటగా.. ఆఖరి క్వార్టర్‌లో జర్మనీ క్రీడాకారులు దూకుడు ప్రదర్శించినా.. డిఫెండర్లు, గోల్ కీపర్ గోల్స్ కాకుండా అడ్డుకున్నారు. పలు పెనాల్టీ కార్నర్లను గోల్ కాకుండా చూశారు. భారత్ 17, 21, 29, 31, 34 నిమిషాల వ్యవధిలో గోల్స్ వేయగా.. జర్మనీ 2, 24, 45, 48 నిమిషాల్లో గోల్స్ సాధించింది. రెండు గోల్స్‌తో భారత విజయంలో సిమ్రన్ జీత్ కీలకపాత్ర పోషించాడు.

ఒలింపిక్స్‌లో భారత్‌కు హాకీలో 12వ పతకం

ఒలింపిక్స్‌లో భారత్ ఇప్పటి వరకు మొత్తం 12 హాకీ పతకాలు గెలుపొందగా.. జపాన్‌లో భారత్‌కు ఇది రెండో పతకం. టోక్యో 1964 గేమ్స్‌లో సైతం ఫైనల్‌లో పాక్‌ను ఓడించి స్వర్ణం సాధించింది. ఇప్పటి వరకు ఈ విశ్వక్రీడలో ఇప్పటి వరకు భారత్‌కు ఎనిమిది స్వర్ణాలు, ఒక రజత పతకం, మూడు కాంస్య పతకాలు వచ్చాయి.

హాకీ గోల్స్‌ను సెలబ్రేట్ చేసుకుంటుంటే.. కొందరు సెల్ఫ్ గోల్ చేసుకుంటున్నారు

న్యూఢిల్లీ, ఆగష్టు 5: టోక్యోలో మనోళ్లు హాకీ బ్రాంజ్ మెడల్ గెలిచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇవాళ ప్రతిపక్షాలను ఉద్దేశించి ప్రధాని మోదీ ఓ కామెంట్ చేశారు. హాకీలో మనోళ్లు గోల్స్ చేస్తుంటే అందరూ సెలబ్రేట్ చేసుకున్నారని, కానీ కొందరు మాత్రం సెల్ఫ్ గోల్ చేసుకుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. దేశ ప్రగతిని అడ్డుకునేందుకు పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు శతవిధాల ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. పార్లమెంట్‌ను అడ్డుకుంటున్న ప్రతిపక్షాల తీరును ప్రజలు సహించరు అని మోదీ అన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా దేశం ముందుకు వెళ్తోందన్నారు. నెగటివ్ ప్రజలు దేశ పురోగతిని అడ్డుకోలేదన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన స్కీమ్‌తో ప్రయోజనం పొందిన లబ్ధిదారులతో మాట్లాడుతున్న సమయంలో మోదీ ఈ కామెంట్స్ చేశారు. పార్లమెంట్‌ను ఎంత అడ్డుకున్నా.. స్వార్థపరుల రాజకీయాలకు తలొగ్గేదిలేదన్నారు.

భారత హాకీ జట్టు గెలుపుపై సీఎం కేసీఆర్ హర్షం

హైదరాబాద్ , ఆగష్టు 5:టోక్యో ఒలింపిక్స్‌లో భారత దేశ క్రీడాకారులు హాకీ, బాక్సింగ్ కేటగిరీల్లో కాంస్య పతకాలు సాధించడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. 41 ఏండ్ల తర్వాత భారత హాకీ జట్టు విశ్వ క్రీడల్లో పతకం కైవసం చేసుకోవడం సంతోషకరమన్నారు. ఈ విజయంతో భారతదేశపు ప్రముఖ క్రీడ హాకీ విశ్వ వేదికల్లో పునర్వైభవాన్ని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన భారత హాకీ జట్టు కెప్టెన్ మన్ ప్రీత్‌ను, జట్టు క్రీడాకారులను సీఎం ప్రశంసించారు.

మహిళా బాక్సింగ్ కేటగిరీలో తొలిసారి బరిలోకి దిగి కాంస్యం సాధించిన అస్సాంకు చెందిన భారత బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్‌ని సీఎం అభినందించారు. ఒలింపిక్స్‌లో దేశం తరపున పతకం నెగ్గిన మూడో బాక్సర్‌గా లవ్లీనా చరిత్రకెక్కడం పట్ల కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భారత క్రీడాకారులు విశ్వ క్రీడల్లో విజయకేతనం ఎగరేసి మరిన్ని పతకాలు సాధించాలని సీఎం ఆకాంక్షించారు

కృష్ణా బోర్డుకు తెలంగాణ ఈఎన్‌సీ లేఖ

హైదరాబాద్ , ఆగష్టు 5: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (ఐఖీఓ) కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. సీడబ్ల్యూసీ సభ్యుడిపై ఏపీ అభ్యంతరం తెలుపడంపై ఈఎన్‌సీ నిరసన వ్యక్తం చేసింది. రాయలసీమ ప్రాజెక్టు పరిశీలన బృందంలో సీడబ్ల్యూసీ సభ్యుడు దేవేందర్ రావు ఉన్నారు. బృందంలో దేవేందర్ రావు ఉండటంపై ఏపీ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. గతంలో సీడబ్ల్యూసీ సభ్యులపై తాము అభ్యంతరం చెప్పలేదని తెలంగాణ ఈఎన్‌సీ గుర్తు చేసింది. రాష్ట్ర ప్రాజెక్టుల పరిశీలన బృందంలో కే శ్రీనివాస్ ఉన్నారు. గతంలో కే శ్రీనివాస్‌పై తాము అభ్యంతరం చెప్పలేదని స్పష్టం చేసింది. సీడబ్ల్యూసీ అధికారికి ప్రాంతాలను ఆపాదించడం అనైతికం అని ఈఎన్‌సీ పేర్కొన్నది. ఎన్జీటీ ఆదేశాలను ఆలస్యం చేయడమే ఏపీ ఉద్దేశమని తెలంగాణ ఈఎన్‌సీ అభిప్రాయపడింది. ఎన్జీటీ ఆదేశాల మేరకు రాయలసీమ పనులను కేఆర్ఎంబీ పరిశీలించాలి. రాయలసీమ పనుల పరిశీలనపై ఈ నెల 9వ తేదీ లోపు నివేదిక ఇవ్వాలని తెలంగాణ ఈఎన్‌సీ కోరింది.

ఈ నెల 9వ తేదీన నిర్వహించబోయే కృష్ణా, గోదావరి బోర్డు సమావేశానికి హాజరు కావడం లేదని తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ స్పష్టం చేశారు. కృష్ణా జలాల వివాదం కేసు సుప్రీంకోర్టు, ఎన్జీటీలో విచారణ ఉన్నందున భేటీకి రాలేమని తెలిపారు. బోర్డు సమావేశానికి మరో తేదీ ఖరారు చేయాలని ఈఎన్‌సీ కోరింది. వీలైనంత త్వరగా బోర్డును సమావేశపర్చాలని కోరింది తెలంగాణ ప్రభుత్వం.

భారత్‌కు యూఎస్ ఎయిడ్ మిషన్ డైరక్టర్‌గా వీణా రెడ్డి

హైదరాబాద్ , ఆగష్టు 5:భారత్-అమెరికా సంతతికి చెందిన వీణా రెడ్డి.. మన దేశానికి యూఎస్ ఎయిడ్ ఏజెన్సీ మిషన్ డైరక్టర్‌గా ఎంపికయ్యారు. భారత్‌తో పాటు భూటాన్‌లో ఆమె సేవలు అందించనున్నారు. అమెరికా సీనియర్ ఫారిన్ సర్వీస్‌లో సభ్యురాలు అయిన వీణా రెడ్డి.. మన తెలుగు అమ్మాయి కావడం విశేషం. భారత్‌కు యూఎస్ ఎయిడ్ మిషన్ డైరక్టర్‌గా ఆమె ఇవాళ బాధ్యతలు స్వీకరిం చారు. యూఎస్ ఎయిడ్ తరపున ఇండియాలో సేవలు అందించనున్న తొలి భారతీయ అమెరికన్‌గా ఆమె రికార్డు నెలకొల్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన వీణారెడ్డి.. యూఎస్ ఫారిన్ సర్వీస్‌లో తన కెరీర్‌ను ప్రారంభించారు. గతంలో ఆమె కంబో డియాలో యూఎస్ ఎయిడ్ మిషన్ డైరక్టర్‌గా చేశారు. హైతిలోనూ డిప్యూటీ మిషన్ డైరక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అమెరికా ప్రభుత్వంలో ఉద్యోగం సంపాదించడానికి ముందు.. వీణా రెడ్డి కార్పొరేట్ కంపెనీలో అటార్నీగా చేశారు. కొలంబియా లా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ చేశారామె. చికాగో వర్సిటీలో బీఏ చేశారు. యూఎస్ ఎయిడ్ (యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్మెంట్) భారత ప్రభుత్వంతో గత ఏడు దశాబ్దాల నుంచి భాగస్వామిగా ఉందని, ఈ బంధాన్ని మరి ంత బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తానని ఆమె అన్నారు. కరోనా మహమ్మారి వల్ల ఇండియాతో పాటు ఇతర దేశాలపైన తీవ్ర ప్రభావం పడిందని, రెండు దేశాల మధ్య భాగస్వామ్యంతో మెరుగైన భవిష్యత్తును నిర్మించనున్నట్లు వెల్లడించారు.

రెజ్లింగ్‌లో సిల్వర్ మెడల్ గెలిచిన రవికుమార్ దహియా

టోక్యో, ఆగష్టు 5:ఒలింపిక్స్ రెజ్లింగ్‌లో ఇండియన్ రెజ్లర్ రవికుమార్ దహియా (ఖీజీలతి ఆజీష్టతిఎజీ) సిల్వర్ మెడల్ సాధించాడు. గురువారం 57 కేజీల విభాగంలో జరిగిన ఫైనల్లో రష్యన్ ఒలింపిక్ కమిటీకి చెందిన రెజ్లర్ జవుర్ ఉగుయెవ్ చేతిలో రవి 4-7 తేడాతో ఓడిపోయాడు. దీంతో ఒలింపిక్స్ రెజ్లింగ్‌లో సిల్వర్ గెలిచిన రెండో ఇండియన్ రెజ్లర్‌గా అతడు నిలిచాడు. గతంలో 2012 ఒలింపిక్స్‌లో సుశీల్‌కుమార్ రెజ్లింగ్‌లో సిల్వర్ సాధించిన విషయం తెలిసిందే. ఏమాత్రం అంచనాలు లేకుండా తొలిసారి ఒలింపిక్స్ బరిలోకి దిగిన రవి దహియా ఏకంగా ఫైనల్ చేరి ఆశ్చర్య పరిచిన విషయం తెలిసిందే.

రష్యన్ ఒలింపిక్ కమిటీకి చెందిన జవుర్ ఉగుయెవ్ 57 కిలోల కేటగిరీలో డిఫెండింగ్ వరల్డ్ చాంపియన్. గతేడాది డిసెంబర్‌లో బెల్‌గ్రేడ్‌లో జరిగిన వరల్డ్‌కప్‌లో గెలిచాడు. తొలిసారి ఒలింపిక్స్ బరిలో దిగాడు. గత 15 టోర్నమెంట్‌లలో అతడు 14 మెడల్స్ గెలిచాడు. అందులో 12 గోల్డ్ మెడల్స్ ఉండటం విశేషం. 2020 వరల్డ్‌కప్‌లో ప్రత్యర్థులపై 45-1 స్కోరుతో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించాడు. రవి దహియా ఇతనితో 2019 వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఆడి ఓడిపోయాడు. దహియాపై 6-4తో గెలిచాడు. ఆ టోర్నీలో రవి బ్రాంజ్ మెడల్ గెలిచాడు.

సాగుకు అనుగుణంగా ఎరువులు సరఫరా చేయాలి : మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్ , ఆగష్టు 5: గత ఏడేండ్లలో తెలంగాణలో పంటల సాగు గణనీయంగా పెరిగిందని, అందుకు అనుగుణంగా ఎరువులను సరఫరా చేయాలని ఇఫ్కో ప్రతినిధులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఇఫ్కో ప్రతినిధులతో మంత్రి నిరంజన్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇఫ్కో మార్కెటింగ్ డైరెక్టర్ యోగేంద్ర కుమార్, జీఎం జగన్మోహన్ రెడ్డి, తెలంగాణ మార్కెటింగ్ మేనేజర్ కృపా శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. సాగునీటి సరఫరా, రైతుబంధు, రైతుభీమా, ఉచితంగా 24 గంటల విద్యుత్ సరఫరా మూలంగా వ్యవసాయం మీద రైతులకు నమ్మకం పెరిగిందన్నారు. వ్యవసాయం దండగ అనే పరిస్థితి నుండి పండుగ అనే పరిస్థితికి వచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ అనుకూల విధానాలతో ధాన్యం దిగుబడిలో తెలంగాణ దేశంలో రెండో స్థానానికి చేరింది. రైతుల ఆత్మహత్యలు తగ్గి ఆత్మవిశ్వాసంతో వ్యవసాయం చేస్తున్నారు. పంటల ప్రణాళిక ప్రకారం తెలంగాణకు యూరియా సరఫరా చేయాలన్నారు. తెలంగాణలో నానో యూరియా ప్లాంట్ ఏర్పాటు కోసం ఇఫ్కో సమావేశంలో చర్చించాలన్నారు. దక్షిణ తెలంగాణలో నానో యూరియా ప్లాంట్ ఏర్పాటుతో దక్షిణ భారతదేశం మొత్తానికి అందుబాటులో ప్లాంటు ఉంటుంది అని మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు.

గిరిజన జీవన వైవిధ్యాన్ని తెలిపే ప్రదర్శన ప్రారంభం

హైదరాబాద్ , ఆగష్టు 5:ఆగస్టు 8వ తేదీ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజనుల జీవన వైవిధ్యాన్ని తెలిపే ప్రదర్శన ప్రారంభమైంద. నగరంలోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో నాలుగు రోజుల పాటు (05వ తేదీ నుంచి 08వ తేదీ వరకు) కొనసాగే ఈ ప్రదర్శనను రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ గురువారం ప్రారంభించారు. గిరిజన చేతివృత్తులు, చిత్రలేఖనం, వారి జీవన వైవిధ్యం తెలిపేలా ప్రదర్శన కొలువు తీరింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్, ప్రత్యేక కార్యదర్శి దివ్య దేవరాజన్, అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి, సంయుక్త సంచాలకులు సముజ్వల, గిరిజన మ్యూజియం క్యూరేటర్ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు నైపుణ్య శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి : ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

హైదరాబాద్ , ఆగష్టు 5: మెదక్ పార్లమెంట్ పరిధిలో చేనేత కార్మికులకు నైపుణ్య శిక్షణా కేంద్రాలు, సాంకేతిక సంస్థలను ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా లోక్ సభలో 377 నిబంధన కింద ఎంపీ ప్రత్యేకంగా ఈ అంశాన్ని ప్రస్తావించారు. మెదక్ పార్లమెంటు పరిధిలో సిద్దిపేట, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు మొత్తం ఏడు నియోజకవర్గాలలో సుమారు 30 వేల మంది నేతన్నలు ఉన్నారన్నారు. ఆధునిక సాంకేతికతలను అమలు చేస్తుండడంతో ప్రస్తుత చేనేత కార్మికుల నైపుణ్యాలకు సరిపోవడం లేదన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాల పెంపుదల కోసం తన పార్లమెంట్ పరిధిలో నైపుణ్య శిక్షణా కేంద్రాలు, సాంకేతిక సంస్థలను ఏర్పాటు చేయాలని కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రిని ఎంపీ కోరారు

వరదల్లో మొరాయించిన బోటు.. మంత్రిని కాపాడిన రెస్క్యూ దళాలు

దాతియా, ఆగష్టు 5:: మధ్యప్రదేశ్ హోంమంత్రి నరోత్తమ్ మిశ్రాకు అనూహ్య పరిస్థితి ఎదురైంది. దతియా జిల్లాలో వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఆ ఆపరేషన్‌ను దగ్గర ఉండే నిర్వహించేందుకు మంత్రి ప్రత్యేక బోట్‌లో అక్కడికి వెళ్లారు. అయితే భారీగా వస్తున్న వరదల ధాటికి మంత్రి ఉన్న బోటుపై చెట్టు పడింది. దీంతో ఆ బోటు ఇంజిన్ ఫెయిలైంది. ఆ వరద నీటిలో చిక్కుకున్న మంత్రిని ప్రత్యేక రెస్క్యూ దళం కాపాడింది. ఎస్‌డీఆర్‌ఎఫ్ బోటులో సర్వేకు వెళ్లిన మంత్రికి చేదు అనుభవం ఎదురైంది. ఓ ఇంటి టెర్రెస్‌పై చిక్కుకున్న 9 మందిని రక్షించేందుకు చేపట్టిన ఆపరేషన్‌ను మంత్రి పర్యవేక్షించారు. అయితే తొలుత ఇంటిపై చిక్కుకున్న వారిని రక్షించారు. ఆ తర్వాత మంత్రిని ఎస్‌డీఆర్‌ఎఫ్ దళాలు ఎయిర్‌లిఫ్ట్ చేశాయి. ఈ ఘటనపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ మండిపడింది. బీజేపీ చాలా ప్రమాదకరమైన నంటల్లు చేస్తున్నట్లు ఆరోపించింది. స్టైడర్‌మ్యాన్‌లో నటించేందుకు హోంమంత్రి ప్రయత్నించారని, దాని వల్ల ఆయన ప్రాణాలకే ముప్పు అన్నారు.

వేర్వేరు సంఘటనలో రైలు ఢీకొని ఇద్దరు మృతి

హైదరాబాద్ , ఆగష్టు 5:అప్పుల బాధతో ఓ కూలీ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి, శంషాబాద్ ప్రాంతానికి చెందిన యాదయ్య కుమారుడు శ్రీకాంత్(25) వృత్తి రీత్యా కూలీ. అప్పులు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి తిమ్మాపూర్-ఉందానగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు కిందపడి శ్రీకాంత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో శారీర భాగాలు చెల్లచెదురైనాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని స్వాధీనపర్చుకుని పోస్ట్‌మార్టం కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాలు దాటుతుండగా గుంటూరు రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి కథనం ప్రకారం.. బుద్వేల్ ప్రాంతానికి చెందిన అనంతయ్యగౌడ్ కుమారుడు నర్సింహులుగౌడ్(49) బుధవారం రాత్రి బుద్వేల్ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా అదే సమయంలో ఎదురుగా వచ్చిన గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని నర్సింహులుగౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

45 ఏండ్లు పైబడిన వారికి కొవిషీల్డ్ డోసుల మధ్య విరామం తగ్గింపు!

న్యూఢిల్లీ, ఆగష్టు 5:భారత్‌లో కరోనా వ్యాక్సిన్ల లభ్యత పెరగడంతో 45 ఏండ్లు పైబడిన వారికి కొవిషీల్డ్ రెండు డోసుల మధ్య విరామాన్ని తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వ్యాక్సిన్ల కొరత కారణంగానే రెండు టీకాల మధ్య విరామాన్ని పెంచారని విమర్శలు పెరుగుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం టీకా డోసుల మధ్య విరామాన్ని తగ్గించేందుకు కసరత్తు సాగిస్తోంది. కొవిషీల్డ్ వ్యాక్సిన్ డోసుల మధ్య విరామాన్ని ప్రస్తుతం అన్ని వయసుల వారికి 12 నుంచి 16 వారాలుగా నిర్ధారించారు.

టీకాల సామర్థ్యంపై తాము సేకరించిన డేటా ఆధారంగా టీకా డోసుల విరామాన్ని తగ్గించే దిశగా రెండు మూడు వారాల్లో ఓ నిర్ణయం తీసుకుంటామని భారత్‌లో వ్యాక్సినేషన్‌పై ఏర్పాటైన సాంకేతిక సలహా గ్రూప్ (ఎన్‌టీఏజీఐ) సంకేతాలు పంపింది. వచ్చే వారం ఎన్‌టీఏజీఐ భేటీలో ఈ దిశగా సంప్రదింపులు జరగనున్నాయి. వివిధ వయసుల వారిపై వ్యాక్సిన్ల ప్రభావం, వ్యాక్సిన్ల డోసుల మధ్య విరామం వంటి అంశాలపై తాము డేటాను సేకరించామని రెండు నుంచి నాలుగు వారాల్లోగా కొవిషీల్డ్ డోసుల మధ్య విరామం తగ్గించే విషయంలో ఓ నిర్ణయం తీసుకుంటామని ఎన్‌టీఏజీఐ చీఫ్ డాక్టర్ ఎన్‌కే అరోరా వెల్లడించారు.

కొవిషీల్డ్ సింగిల్ డోస్‌తోనూ మెరుగైన రోగనిరోధక స్పందన కనిపించిందని శాస్త్రీయ అధ్యయనంలో వెల్లడైందని ఆయన చెప్పారు. బ్రిటన్‌లో ఆక్స్‌ఫర్డ్-ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్ రెండు డోసుల మధ్య విరామం రెండు నెలలకు తగ్గించారు. ఇక భారత్‌లో తొలుత కొవిషీల్డ్ డోసుల మధ్య విరామం నాలుగు వారాలు కాగా ఆపై దాన్ని 4-8 వారాలకు పొడిగించగా తాజాగా ఈ గ్యాప్‌ను 12 నుంచి 14 వారాలుగా నిర్ణయించారు.

విమానయాన రంగంలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు

ముంబై , ఆగష్టు 5: దేశీయ విమానయాన పరిశ్రమకు ప్రోత్సాహం ఇచ్చేందుకు (ంలతిజీవితినీని ఃనీనీబబివతీ) కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. విమానయాన రంగంలో మౌలిక సదుపాయాలు, సౌకర్యాలకు సిద్ధమవుతున్న మోదీ ప్రభుత్వం.. అక్కడ రూ. 25,000 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నది. వచ్చే 4,5 సంవత్సరాలలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఈ రంగంలో రూ. 25,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నది. దీంతో విమానాశ్రయంలో అత్యున్నత శ్రేణి మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు హైటెక్‌గా మారనున్నాయి. అదేవిధంగా, దేశంలో 6 కొత్త గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలను ప్రారంభించేందుకు కూడా సన్నాహాలు జరుగుతున్నాయి.

రాబోయే సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా 21 కొత్త విమానాశ్రయాలను ప్రారంభిస్తామని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ రాజ్యసభలో తెలిపారు. ఇప్పటివరకు ఆరు గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలు దేశవ్యాప్తంగా పనిచేస్తున్నాయి. వీటిలో మహారాష్ట్రలోని షిర్డీ, సిక్కింలోని పాక్యాంగ్, పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్, కేరళలోని కన్నూర్, కర్ణాటకలోని కలబురగి మరియు ఆంధ్రప్రదేశ్‌లోని ఓర్వకల్లు ఉన్నాయి. 2007 లో ఎయిర్ ఇండియా ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో విలీనమైందని, అప్పటి నుంచి కంపెనీ నిరంతరం భారీ నష్టాలను చవిచూస్తున్నదని మంత్రి వీకే సింగ్ చెప్పారు. 2020 మార్చి 31 నాటికి కంపెనీ మొత్తం నష్టం రూ. 70,820 కోట్లకు పెరిగిందని తెలిపారు. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) మార్గం ద్వారా ఇప్పటికే ఉన్న, కొత్త విమానాశ్రయాలలో ప్రైవేట్ పెట్టుబ డులను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమ న్నారు. 2021 జూలై 27 నాటికి, రీజనల్ కనెక్టివిటీ స్కీమ్- ఉడాన్ కింద 359 మార్గాలు పని చేస్తున్నాయని, ఇవి భారతదేశంలో 59 వాటర్ ఎయిర్‌రోమీలు, ఐదు హెలిపోర్ట్‌లతో సహా 59 సర్ఫేస్, అండర్‌సర్ఫేస్ ఎయిర్‌పోర్ట్‌లను కలుపుతా యని పేర్కొన్నారు. ఆధునిక వైడ్-బాడీ విమానాలను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం విమానయాన సంస్థలను ప్రోత్సహిస్తు న్నామని వెల్లడిం చారు. విస్తారా ఎయిర్‌లైన్స్ ఇప్పటివరకు రెండు కొత్త వైడ్-బాడీ విమానాలను కొను గోలు చేసినట్లు కేంద్ర మంత్రి వీకే సింగ్ చెప్పారు.

కేటీఆర్ సార్‌కు సెల్యూట్.. హరిప్రియ ట్వీట్

హైదరాబాద్ , ఆగష్టు 5: ఆపదలో ఉన్న వారిని తక్షణమే ఆదుకునే గొప్ప ఆపద్భాంధవుడు కేటీఆర్. అలా ట్వీట్ చేస్తే.. ఇలా స్పందించి.. అండగా నిలిచే గొప్ప మనసున్న మహానుభావుడు కేటీఆర్. సరస్వతి పుత్రికల పాలిట దేవుడై దర్శనమిస్తున్న కేటీఆర్ సార్‌కు సెల్యూట్ అంటూ ఓ యువతి ట్వీట్ చేసింది. అంతగిరి హరితప్రియ అనే విద్యార్థిని నల్సార్ యూనివర్సిటీ నిర్వహించిన లా ఎంట్రెన్స్ టెస్టు రాసింది. అందులో ఆమె మెరుగైన ర్యాంకు సాధించడంతో యూనివర్సిటీలోనే బీఏ ఎల్ఎల్‌బీలో ప్రవేశం పొందింది. కానీ అడ్మిషన్ కావడానికి సరిపడా డబ్బులు లేకపోవడంతో తనకు ఆర్థిక సాయం చేయాలని హరిప్రియ ట్విట్టర్ వేదికగా కేటీఆర్‌ను అభ్యర్థించింది. తన నాన్న దినసరి కూలీ అని తన గోడును వెల్లబోసుకుంది. హరిప్రియ ట్వీట్‌పై కేటీఆర్ తక్షణమే స్పందించారు. హరిప్రియ సాధించిన విజయానికి శుభాకాంక్షలు తెలుపుతూ కేటీఆర్ రీట్వీట్ చేశారు. తప్పకుండా సహాయం చేస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ క్రమంలో హరిప్రియతో ఆమె కుటుంబ సభ్యులను కేటీఆర్ ఇవాళ కలిసి ఆర్థిక సాయం అందించారు.

దీంతో హరిప్రియ.. కేటీఆర్ సార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ట్వీట్ చేసింది. సార్.. మీ సాయాన్ని ఎప్పటికీ మరిచిపోలేను. మీ విలువైన సమయాన్ని తమకు కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు. మీరందించిన ఆర్థిక సాయం తన చదువుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మీ టీమ్‌కు కూడా ప్రత్యే కృతజ్ఞతలు. వారు తనను వెన్నంటి ఉండి.. అడ్మిషన్ ప్రాసెస్‌ను దగ్గరుండి చూసుకున్నారు. 24 గంటల్లోనే తన సమస్యను పరిష్కరించారు.. మీతో పాటు మీ టీమ్ సభ్యులకు సె

అణు శక్తి విధ్వంసానికి వినియోగించరాదు?!

(06 ఆగష్టు 'హిరోషిమా దినం' సందర్భంగా)

ప్రపంచ శాంతి పునాదిగా, ప్రపంచ కుగ్రామ సమగ్రాభివృద్ధికి ఊతం ఇచ్చేవిగా శక్తి వనరులు ఉండాలి. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 06 ఆగష్టు 1945న ఉదయం 8:15 గంటల సమయంలో 'మాన్‌హట్టన్ ప్రాజెక్ట్' రూపంలో అమెరికా బి-29 బాంబర్ సహాయంతో ప్రయోగించిన 'లిటిల్ బాయ్' అనబడే 5 టన్నుల ఆటమ్ బాంబు తాకిడికి జపాన్‌లోకి పారిశ్రామిక, మిలిటరీ కేంద్రమైన 'హిరోషిమ' నగరం నేలమట్టం కావడం మానవాళి చరిత్రలో చీకటి ఘటనగా నిలుస్తున్నది. మూడు రోజుల అనంతరం 09 ఆగష్టున సముద్రతీర పారిశ్రామిక, మిలిటరీ 'నాగసాకి' నగరంపై మరో ఆటమ్ బాంబు వేయడంతో జరిగిన మానవ, ఆస్తి విధ్వంసం అంచనాలకు అందనంత అధికంగా నమోదు అయ్యింది. ఈ ఆటమ్ బాంబుల తాకిడికి 3.5 లక్షల వరకు అమాయక జపనీయులు మరణించగా, 35,000లకు పైగా గాయపడడం, 60,000లకు పైగా ప్రజలు ఏండ్ల తరబడి క్షతగాత్రులు రేడియేషన్, తీవ్రంగా కాలిన గాయాలతో నరకం అనుభవించారు. హిరోషిమ నగరం దాదాపు 70 శాతం పైగా నేలమట్టం కావడంతో ప్రపంచానికి అణుశక్తి తీవ్రత ఎంత ఉంటుందో అర్థం అయ్యింది. నగరంలోని 90,000 భవనాల్లో దాదాపు 65,000 భవనాలు నేలమట్టం అయ్యాయని తెలుస్తున్నది. నాగసాకి నగరంపై 09 ఆగష్టు 1945న ప్రయోగించిన 'ఫాట్ మ్యాన్' ఆటమ్ బాంబు విధ్వంసంతో జపాన్ ఓటమిని అంగీకరించడం, ప్రపంచ యుద్ధం-2 కొద్ది రోజుల్లోనే ముగిసిపేవడం వెంట వెంటనే జరిగి పోయాయి. 06 ఆగష్టు 2021 రోజున ప్రపంచ దేశాలు 76వ 'హిరోషిమ దినం' పాటిస్తూ, అణు పరమాణు శక్తులను మానవాళి శాంతి సంక్షేమాలకు మాత్రమే వాడాలని, విధ్వంసం కోసం దుర్వినియోగం చేయవద్దంటూ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ఈ రోజున హిరోషిమ నరగంలోని 'శాంతి వనం'లో ప్రధాన కార్యక్రమం నిర్వహిస్తారు. నాటి ఆటమ్ బాంబు దెబ్బకు నేటికీ కోలుకోని జపనీయులు కసితో శాంతియుత మార్గాల్లో అభివృద్ధి దిశగా పయనించడం, అగ్ర రాజ్యంగా నిలవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తూనే, ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. అణుశక్తిని విధ్వంసం కోసం వాడవద్దంటూ ప్రచారం నిర్వహించే సమయం ఆసన్నమైంది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో జర్మనీ ఓటమిని అంగీకరించినప్పటికీ జపాన్ పోరాటం చేయడానికే నిర్ణయించడంతో, జపాన్‌ను ఓడించడానికి అమెరికా పన్నిన కుయుక్తిగా ఆటమ్ బాంబు ప్రయోగం జరిగిందని తెలుస్తున్నది.

నేడు ఓలంపిక్ క్రీడలకు వేదికైన జపాన్‌లో 1945 కాలపు రెండవ ప్రపంచ యుద్ధం మిగిల్చిన మానని గాయాలు, చేదు అనుభవాలు గుర్తుకు వస్తున్నాయి. 06 ఆగష్టు 2021న ఓలంపిక్ వేదికగా 'హిరోషిమ దినం' రోజున కనీసం ఒక నిమిషం నిశ్శబ్దం పాటిస్తూ, ప్రాణాలు కోల్పోయిన అమాయకుల ఆత్మకు శాంతి కలిగించే ప్రయత్నం చేయాలని విజ్ఞులు అంటున్నారు. ఇలాంటి అణు బాంబు ప్రయోగాల ఫలితంగా ప్రచ్ఛన్న యుద్ధాలకు బీజాలు పడ్డాయనడంలో అతిశయోక్తి లేదు. అణ్వాయుధాలను వినాశనానికి వాడకూడదనే నినాదంతో ప్రతి ఏట 29 ఆగష్టున 'అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినం' పాటించాలని ఐరాస తీర్మానించడం హర్షదాయకం. హిరోషిమ దినాన్ని మరో విధంగా 'అంటీ-న్యూక్లియర్ దినం' లేదా 'హిరోషిమ శాంతి దినం'గా కూడా పిలవడం అర్థవంతంగా ఉన్నది. ప్రపంచ దేశాలు గెలుపోటములు, ఆదిపత్య ధోరణిలు పక్కన పెట్టి శాంతి స్థాపన దిశగా ఆలోచనలు, ఆచరణాత్మక, సర్వ మానవ అంగీకార అడుగులు వేయాలని ప్రపంచ మానవాళి కోరుకుంటున్నది.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ప్రతి కుటుంబానికి రూ.2 లక్షలు ఆర్థిక సాయం: కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగష్టు 5:దేశ వ్యాప్తంగా మహిళలకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. స్వశక్తి సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కరోనా బారిన పడి చనిపోతున్న కుటుంబాలకు ఆర్థికంగా సాయం చేయాలని ఈ నిర్ణయం తీసుకుంది. స్వశక్తి సంఘాల సభ్యులతో పాటు జీవిత భాగస్వాములకు ఇన్సూరెన్స్ వర్తింపచేసేలా ప్రధాని సురేఖ బీమా యోజన(పీఎంఎస్‌బీవై)లో చేర్పించాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో మహిళా సంఘాల సభ్యులందరూ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.

కాగా ప్రీమియంను మహిళలు తీసుకునే వడ్డీ లేని రుణాల నుంచి లేదా గ్రూపులోని కార్పస్ ఫండ్ ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.350 చెల్లించాలని పేర్కొంది. ప్రీమియం చెల్లించిన సభ్యులు ఏదైనా కారణంతో దురదృష్టవశాత్తూ చనిపోతే వారి కుటుంబానికి రూ.2 లక్షల సాయం అందించనున్నారు. కాగా తెలంగాణలో పీఎంఎస్‌బీవై పథకం కింద 41.16 లక్షల మందిని చేర్పించాలని రాష్ట్ర అధికారులకు కేంద్రం సూచించింది.

చెట్ల పెంపకం ఒక యజ్ఞంలా చేపట్టాలి: సీఎం జగన్

అమరావతి, ఆగష్టు 5:రాష్ట్రంలో చెట్ల పెంపకం ఒక యజ్ఞంలా జరగాలని సీఎం వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్ ఆవరణలో గురువారం 'జగనన్న పచ్చ తోరణం-వన మహోత్సవం' కార్యక్రమాన్ని సీఎం మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలని ప్రతిజ్ఞ చేయించారు. చెట్లను పెంచడం చాలా అవసరమని సీఎం జగన్ అన్నారు. చెట్ల పెంపకంతో కాలుష్యం ఉండదని పేర్కొన్నారు. చెట్లు ఉన్న చోటే వర్షాలు ఎక్కువగా పడే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర విస్తీర్ణంలో 33 శాతం పచ్చదనం ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రాన్ని పచ్చతోరణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సీఎం జగన్ పిలుపునిచ్చారు.

సింధునే బ్రాండ్ అంబాసిడర్ చేయాలి: రాజాసింగ్

హైదరాబాద్ , ఆగష్టు 5:టోక్యో ఒలింపిక్స్ లో కాస్య పతకం సాధించిన బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ పీవీ సింధుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ప్రధాని మోదీతో పాటు అన్ని రంగాల నుంచి సింధుకు సోషల్ మీడియాలో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అయితే తాజాగా సింధూని తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ గా నియమించాలంటు సరికొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పీవీ సింధుపై ప్రశంసల వర్షం కురిపిస్తూనే తన డిమాండ్ ను సీఎం కేసీఆర్ కు తెలియజేశారు. ఇక టెన్నిస్ క్రీడాకారిణి సానియా మిర్జాను 'తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్'గా తప్పించాలని డిమాండ్ చేశారు. సానియా పాకిస్థాన్ వ్యక్తిని పెళ్లి చేసుకోవడంతోనే పాక్ వ్యక్తి అయిపోయారని.. అలాంటి సానియాను తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగించడం సరికాదని రాజాసింగ్ వ్యాఖ్యానించారు.

రియో ఒలింపిక్స్ లో సిల్వర్ మెడల్, ప్రస్తుతం జరుగుతున్నటోక్యో ఒలింపిక్స్ లో కాంస్య పతకం సాంధించిన సింధూ ఉండగా ఎందుకు పాకిస్థాన్ కోడలయిన సానియా మిర్జాను తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ గా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. సింధు భారత దేశానికి మంచి పేరు తీసుకొచ్చింది, మన తెలంగాణ కు పేరు తెచ్చింది. ఇకనుంచి స్పోర్ట్స్ మీద దృష్టి పెట్టాలని.. తెలంగాణ నుంచి మంచి మంచి క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు రాజా సింగ్.

పాకిస్థాన్ క్రికెట్ ప్లేయర్ షోయబ్ మాలిక్‌ను పెళ్లి చేసుకుంది సానియా మిర్జా. సోయబ్ సానియా దంపతులకు ఓ బాబుకి జన్మనిచ్చారు. దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రయోజనాలను ప్రమోట్ చేయడానికి సానియా మిర్జాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తూ.. కేసీఆర్ ప్రభుత్వం గతంలో నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఆమెకు రాష్ట్ర ప్రభుత్వ అధికార ధ్రువీకరణ పత్రంతో పాటు కోటి రూపాయల చెక్ అందించారు. సానియా అసలు సిసలైన హైదరాబాదీ కావడం తెలంగాణకు గర్వకారణమని కేసీఆర్ వ్యాఖ్యానించారు. టెన్నిస్‌లో దేశానికి సాధించిపెట్టిన పథకాలకు గాను సానియా మిర్జాను కేంద్ర ప్రభుత్వం 2004లో అర్జున, 2006లో పద్మశ్రీ అవార్డులతో సత్కరించింది. క్రీడల్లో అత్యున్నతమైన రాజీవ్ ఖేల్ రత్న అవార్డును కూడా ఆమెకు ప్రకటించారు.

అలా ఎక్కడ టచ్ చేసినా రేపే.. కేరళ హైకోర్టు సంచలన తీర్పు

తిరువనంతపురం, ఆగష్టు 5: : పోక్సో చట్టం కింద నమోదైన ఓ లైంగికదాడి కేసులో కేరళ హైకోర్టు గురువారం సంచలన తీర్పు ఇచ్చింది. పురుషాంగంతో మహిళ శరీరాన్ని ఎక్కడ టచ్ చేసినా అది రేప్ కిందకే వస్తుందని కోర్టు స్పష్టం చేసింది. అయితే ఓ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు అయింది. ఈ నేపథ్యంలో తాను లైంగికదాడికి పాల్పడలేదని, కేవలం పురుషాంగంతో టచ్ చేశానని, అది ఎలా లైంగికదాడి అవుతుందని కోర్టుకు అభ్యర్థించాడు.

దీనిపై కోర్టు పూర్తిస్థాయిలో విచారణ జరిపిన తర్వాత.. సెక్షన్ 375 ప్రకారం.. యోని, మూత్రనాళం, పాయువు వద్దనే కాకుండా.. పురుషాంగాన్ని ఎక్కడ టచ్ చేసినా రేప్ చేసినట్టే అని కోర్టు తెలిపింది. అయితే బాధితురాలి వయసును ఆమె తరపు న్యాయవాది నిర్ధారించకపోవడంతో.. పోక్సో కేసును కోర్టు కొట్టివేసింది. లైంగికదాడికి సంబంధించిన సెక్షన్ల కింద మాత్రమే నిందితుడికి కోర్టు జీవిత ఖైదు విధించింది.

దళిత వర్గానికే కాంగ్రెస్ టికెట్?

హైదరాబాద్ , ఆగష్టు 5:హుజురాబాద్ ఉప ఎన్నికతో రాష్ట్ర రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. బీజేపీ, టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విషయంలో స్పష్టత రాగా.. కాంగ్రెస్ పార్టీ ఎవరిని ఎంపిక చేస్తుంది? అన్నది ఉత్కంఠగా మారింది. హుజురాబాద్ బరిలో దింపే అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం కసరత్తు చేస్తోంది. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో దళిత సామాజికవర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దింపాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీ, టీఆర్ఎస్‌లు బీసీ సామాజిక వర్గం అభ్యర్థిని బరిలోకి దింపితే.. కాంగ్రెస్ మాత్రం దళిత సామాజికవర్గం అభ్యర్థిని బరిలోకి దింపాలని భావిస్తోంది.

కాంగ్రెస్ అభ్యర్థిని ఎంపిక చేసే బాధ్యతను మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ డిప్యూటీ సీఎం దామోదర్ రాజానర్సింహలకు పీసీసీ చీఫ్ రేవంత్ అప్పగించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో దిగేందుకు ఆసక్తి చూపుతున్న నాయకులు, వారి బలాబలాలు, గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓటింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టారు. టీఆర్ఎస్, బీజేపీలను ఢీకొట్టే అభ్యర్థి కోసం కాంగ్రెస్ అన్వేషిస్తోంది. హుజురాబాద్ లో కాంగ్రెస్ తరుపున గతంలో కౌశిక్ రెడ్డి పోటీ చేశారు. అయితే, మారిన రాజకీయ సమీకరణాలతో ఆయన టీఆర్ఎస్ గూటికి చేరారు. దీంతో రెడ్డి సామాజిక వర్గానికే మరోసారి కాంగ్రెస్ టికెట్ ఇస్తారని ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా ఇప్పుడు దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే అభ్యర్థిగా ఫిక్స్ చేయాలనే ఆలోచనలో ఉంది.

హుజూరాబాద్ నియోజకవర్గంలో సుమారు రెండు లక్షలపైగా ఓటర్లున్నారు. ఇందులో బీసీ సామాజిక వర్గం ఓటర్ల తర్వాత దళిత సామాజికవర్గానికి చెందినవారు సుమారు 40 వేలకు పైగా ఉంటారని అంచనా. దళిత సామాజికవర్గం ఓటర్లను తమ వైపునకు తిప్పుకొనేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు అంశాన్ని తెరమీదికి తెచ్చింది. ఈ పథకాన్ని హుజూరాబాద్ నుంచే ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ తరుణంలో దళిత సామాజికవర్గానికి చెందిన అభ్యర్థిని హుజురాబాద్ ఉప ఎన్నికల్లో బరిలోకి దింపాలని తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ కు 60 వేల ఓట్లు సాధించింది. దళిత సామాజికవర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దింపడం ద్వారా రాజకీయంగా టీఆర్ఎస్‌పై పైచేయి సాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది.

తొలి సముద్ర ప్రయోగం కోసం బయలుదేరిన స్వదేశీ విమాన వాహక నౌక 'విక్రాంత్'

న్యూఢిల్లీ, ఆగష్టు 5: స్వదేశంలో నిర్మించిన అత్యంత క్లిష్టమైన యుద్ధనౌక 'విక్రాంత్' సముద్ర ప్రయోగం కోసం బయలుదేరడం పట్ల కేంద్ర రేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ హర్షం వ్యక్తం చేశారు. భారత నావికా దళం కోసం కొచ్చిన్ షిప్ యార్డ్ 'విక్రాంత్'ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించింది. అత్యంత క్లిష్టమైన నౌకను దేశంలో రూపొందించి నిర్మించడం ఇదే తొలిసారి అని శ్రీ సోనోవాల్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మేక్ ఇన్ ఇండియా మరియు ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమాలకు ఇది నిజమైన ప్రతిబింబమని ఆయన అన్నారు. దేశం గర్వపడేలా చేసిన కొచ్చిన్ షిప్‌యార్డ్ భారత నౌకాదళాలను మంత్రి అభినందించారు.

విక్రాంత్ చోదక వ్యవస్థ, నావిగేషన్, కమ్యూనికేషన్ తో పాటు నౌక లోని ఇతర పరికరాలు, భాగాల పనితీరును ప్రయోగ దశలో కఠిన పరిస్థితుల మధ్య పరీక్షిస్తారు. హార్బర్ లో అన్ని పరీక్షలను పూర్తి చేసుకున్న 'విక్రాంత్' సముద్ర పరీక్షలకు బయలు దేరింది. కోవిడ్-19 సమయంలో నౌక నిర్మాణాన్ని పూర్తి చేసి పరీక్షలకు సిద్ధం చేయడం దేశం సాధించిన విజయాల్లో ఒక మైలురాయిగా నిలిచి పోతుంది. భారతదేశంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో అతి పెద్ద షిప్ యార్డ్ అయిన కొచ్చిన్ షిప్ యార్డ్ కేంద్ర రేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ కింద పని చేస్తున్న ఏకైక షిప్ యార్డ్. మంత్రిత్వ శాఖ సహాయ సహకారాలతో 2013 ఆగస్టు లో నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. విమాన వాహక యుద్ధ నౌకలను నిర్మించే శక్తి సామర్థ్యాలు తమకు ఉన్నాయని భారత్ నిరూపించింది. యుద్ధ నౌకలను నిర్మిస్తున్న దేశాల సరసన భారతదేశం నిలబడింది.

విమాన వాహక నౌక ప్రాథమిక డిజైన్ ను భారత నౌకాదళానికి చెందిన ఇండియన్ నేవీ డైరెక్టరేట్ ఆఫ్ నేవల్ డిజైన్ రూపొందించింది. ఇంజనీరింగ్, నిర్మాణం మరియు సిస్టమ్ ఇంటిగ్రేషన్ ను కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ చేపట్టి పూర్తి చేసింది. నౌకలోని అన్ని భాగాలను 3డి లో వీక్షించేలా చూడడానికి షిప్ యార్డ్ ఆధునిక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించింది. విమాన వాహక నౌక పరిమాణంలో ఒక నౌకను పూర్తిగా 3 డి మోడల్‌లో రూపొందించి 3 డి మోడల్ ఉపయోగించి సిద్ధం చేసిన ప్రొడక్షన్ డ్రాయింగ్‌లతో నిర్మించడం దేశంలోనే తొలిసారి. 40000 టన్నుల బరువుతో ఒక నౌకను దేశంలో నిర్మించడం ఇదే తొలిసారి. దీని నిర్మాణం కోసం 21,000 టన్నుల ప్రత్యేక గ్రేడ్ ఇనుమును స్వదేశంలో ఉత్పత్తి చేసి వినియోగించడం జరిగింది. నౌకను నిర్మించడం కోసం 2000 కిలోమీటర్ల పొడవైన కేబుళ్లను, 120 కిలోమీటర్ల పొడవైన పైపులను ఉపయోగించడం జరిగింది. నౌకలో 2300 కంపార్ట్‌మెంట్లు అందుబాటులో ఉంటాయి.

విమాన వాహక నౌక ఒక చిన్న తేలియాడే నగరంగా ఉంటుంది. రెండు ఫుట్‌బాల్ మైదానాల పరిమాణంతో ఒక విమాన డెక్ ప్రాంతం ఉంటుంది. సూపర్‌స్ట్రక్చర్‌తో సహా స్వదేశీ విమాన వాహక నౌక 262 మీ పొడవు, 62 మీటర్ల వెడల్పు భాగంలో మరియు 59 మీటర్ల ఎత్తులో ఉంటుంది. 'విక్రాంత్' దాదాపు 28 నాట్ల గరిష్ట వేగం మరియు 18 నాట్ల క్రూయిజింగ్ వేగాన్ని సుమారు 7,500 నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉంది. సూపర్ స్ట్రక్చర్‌లో ఐదు సహా మొత్తం 14 డెక్‌లు ఉన్నాయి. ఓడలో 2,300 కంపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి. మహిళా అధికారులకు వసతి కల్పించడానికి ప్రత్యేకమైన క్యాబిన్‌లతో సహా దాదాపు 1700 మంది సిబ్బంది కోసం నౌకను నిర్మించారు.

బయోమెడికల్ వ్యర్థాల భస్మీకరణ యంత్రం ఆవిష్కరణ

న్యూఢిల్లీ, ఆగష్టు 5:బీహార్ రాష్ట్రంలోని బక్సర్ మున్సిపాలిటీలో వికేంద్రీకరించిన బయోమెడికల్ వ్యర్థాల భస్మీకరణ యంత్రాన్ని భారత ప్రభుత్వం వైజ్ఞానిక సలహాదారు ప్రొఫెసర్ కె. విజయ రాఘవన్ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ యంత్రానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని (టెక్నాలజీని) గణేశ్ ఇంజినీరింగ్ వర్క్స్ సంస్థ రూపొందించింది. వ్యర్థాలనుంచి సంపద సృష్టి అన్న పథకం పేరిట జీవవైద్య వ్యర్థాల నిర్వహణలో సృజనాత్మక సవాలు అన్న శీర్షికతో చేపట్టిన కార్యక్రమంలో టెక్నాలజీని ఎంపిక చేశారు. ప్రధానమంత్రి వైజ్ఞానిక, సాంకేతిక పరిజ్ఞాన, సృజనాత్మక వ్యవహారాల మండలి (పి.ఎం.-ఎస్.టి.ఐ.ఎ.సి.) పర్యవేక్షణలో చేపట్టిన 9 వైజ్ఞానిక శాస్త్ర పథకాల్లో వ్యర్థాలనుంచి సంపద సృష్టి అన్న పథకం కూడా ఒకటి. పి.ఎం.-ఎస్.టి.ఐ.ఎ.సి.కి ప్రభుత్వ ముఖ్య వైజ్ఞానిక సలహాదారు కార్యాలయం సారథ్యాన్ని, మార్గదర్శకత్వాన్ని వహిస్తుంది.

బక్సర్.లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన బయోమెడికల్ వ్యర్థాల భస్మీకరణ యంత్రం 50 కిలోగ్రాముల వరకూ బయో మెడికల్ వ్యర్థాలను భస్మం చేయగలగుతుంది. ఈ యంత్రాన్ని ఎక్కడికైనా తీసుకెళ్లగలిగే వీలుంది. పత్తి, ప్లాస్టిక్.తో అదే సారూప్యత కలిగిన వ్యర్థాలను గంటకు 5 కేజీల చొప్పున భస్మీకరణ చేయగలుగుతుంది. ఈ యంత్రాన్ని ఏర్పాటు చేయడానికి రెండు చదరపు మీటర్ల స్థలం సరిపోతుంది. ఇది పనిచేయడానికి 0.6 కిలోవాట్ల విద్యుత్ అవసరమవుతుంది. పని పూర్తి కాగానే విద్యుత్ సరఫరా దానంతట అదే ఆగిపోయే ప్రత్యేక ఏర్పాటును ఈ యంత్రానికి ఉంది.

ఈ వ్యర్థాల వేడి పునరుద్ధరణకు కూడా ఈ యంత్రంలో తగిన ఏర్పాటు ఉంది. ఈ యంత్రం వినియోగంపై ప్రయోగాత్మక దశలోనే, పలు ప్రాంతాల్లో వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తారు. డిస్టిల్డ్ వాటర్, ఆవిరి, గ్యాస్ బర్నింగ్ తదితర అంశాల ప్రాతిపదికగా ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. నివాస ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఈ యంత్రం సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించేందుకు కూడా చర్యలు తీసుకోనున్నారు. యంత్రాన్ని వినియోగించినపుడు ఎలాంటి పొగా వెలువడకుండా చూస్తారు. అలాగే చిమ్నీ వినియోగాలు, ప్లాస్మా బర్నింగ్, వేస్ట్ హీట్ రికవరీ వంటి అంశాలను సునిశితంగా పరీక్షిస్తారు.

వికేంద్రీకరించిన బయోమెడికల్ భస్మీకరణ యంత్రాన్ని బీహార్ లోని బక్సర్ జిల్లా, బక్సర్ మున్సిపాలిటీలో ప్రారంభించిన సందర్భంగా జరిగిన వర్చువల్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ వైజ్ఞానిక వ్యవహారాల ముఖ్య సలహాదారు ప్రొఫెసర్ కె. రాఘవన్

చిన్న పట్టణాలకు, గ్రామాకు కేంద్రీయ బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణా సదుపాయాలతో అనుసంధానం లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో బయోమెడికల్ వ్యర్థాల సమస్య నెలకొంది. కోవిడ్-19 వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఇది మరింత పెద్ద సమస్యగా తయారైంది. ఈ పరిస్థితుల్లో వికేంద్రీకరించిన బయోమెడికల్ వ్యర్థాల పరిష్కారించే వ్యవస్థకు గల ఆవశ్యకతను గుర్తించారు. ఈ పరిస్థితుల్లో వ్యర్తాలనుంచి సంపద అన్న పథకం పరిధిలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, సృజనాత్మక చాలెంజి కార్యక్రమం కింద సమస్యను పరిష్కరించే ప్రయత్నాలు జరిగాయి. ఇందుకోసం తగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని స్టార్టప్ కంపెనీలు, కార్పొరేట్ కంపెనీలను, వివిధ పరిశోధనా సంస్థల ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను కోరారు. కోవిడ్-19 వ్యాప్తి, లాక్ డౌన్ సమయంలో భారీ పరిమాణంలో పేరుకుపోయిన బయో మెడికల్ వ్యర్థాలను సురక్షితంగా సేకరించడం, ట్రీట్మెంట్ చేయడం వంటి సమస్యల పరిష్కారానికి వినియోగించాల్సిన టెక్నాలజీ కోసం దరఖాస్తులను కోరారు. ఇందుకు సంబంధించి దేశం నలుమూలలనుంచి 460 దరఖాస్తులు అందాయి. వాటినుంచి ప్రయోగాత్మకంగా 3 రకాల సాంకేతిక పరిజ్ఞానాలను ఎంపిక చేశారు. ఈ 3 టెక్నాలజీల పనితీరును స్థానిక పరిపాలనా యంత్రాంగం క్రమం తప్పకుండా పర్యవేక్షించి, పరిశీలించి, మధింపు చేస్తుంది. పర్యవేక్షణ, మదింపుపై సమాచారాన్ని వ్యర్థాలనుంచి సంపద పథకానికి సంబంధించి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్ పోర్టల్.లో పొందుపరుస్తారు.

బక్సర్.లో బయోమెడికల్ వ్యర్థాల భస్మీకరణ యంత్రాన్ని ప్రారంభించిన సందర్భంగా భారత ప్రభుత్వ వైజ్ఞానిక వ్యవహారాల ముఖ్య సలహాదారు ప్రొఫెసర్ కె. విజయ రాఘవన్ మాట్లాడుతూ, టెక్నాలజీ నవీకరణకు భవిష్యత్తులో దాని ఉపయోగానికి మూడు సూచనలను ప్రస్తావించారు. ''వికేంద్రీకరించిన బయోమెడికల్ వ్యర్థాల భస్మీకరణ యంత్రం కోసం టెక్నాలజీని బక్సర్ కు చెందిన గణేష్ ఇంజినీరింగ్ అనే స్టార్టప్ కంపెనీ రూపొందించడం చాలా సంతోష దాయకం. ఈ విషయంలో తగిన సహాయ, సహకారాలు అందించిన బక్సర్ జిల్లా పరిపాలనా యంత్రాగానికి నేను కృతజ్ఞతలు చెప్పదలుచుకున్నాను. ఇక, నిర్వహణా దశనుంచి గణేశ్ ఇంజినీరింగ్ కంపెనీ తన సాంకేతిక పరిజ్ఞాన్ని మరింత నవీకరించుకోవడం, తయారీ రంగంలో తన అవకాశాలను పెంచుకోవడం అవసరం." అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో బక్సర్ నగర పరిషత్ నలహాదారు అజయ్ చౌబే కూడా మాట్లాడారు. "బక్సర్ ప్రాంతానికే చెందిన కంపెనీ స్వదేశీ పరిజ్ఞానంతో టెక్నాలజీని రూపొందించడం ఎంతో గర్వకారణం. వ్యర్థాలు ఎక్కడ ఉన్నాయో అక్కడే వ్యర్థాల పరిష్కార వ్యవస్థను ఈ టెక్నాలజీ సహాయంతో సులభంగా ఏర్పాటు చేయవచ్చు. దీనివల్ల వ్యర్థాల సమస్యను సమర్థంగా పరిష్కరించడానికి వీలుంటుంది, రవాణా చార్జీలను, పనివారికోసం అయ్యే ఖర్చును పొదుపు చేయవచ్చు." అని అన్నారు.

గణేశ్ ఇంజినీరింగ్ వర్క్స్. అనే సంస్థ నూతన, పునర్నవీకరణ ఇంధన మంత్రిత్వ శాఖ ఆమోదం పొందన సంస్థ. జీవ వ్యర్థ పదార్థాలను మండించి, వాటిని గ్యాస్ గా ఇంధన రూపంలోకి మార్చే టెక్నాలజీ కలిగిన ఈ సంస్థ బక్సర్.లో ఏర్పాటైంది.

బయో మెడికల్ వ్యర్థాల భస్మీకరణ ప్రక్రియను ఈ సంస్థ ప్రయోగాత్మకంగా 3 నెలలపాటు నిర్వహిస్తుంది. ఆ తర్వాత ఈ యూనిట్ ను బక్సర్ పరిపాలనా యంత్రాంగమే చేపడుతుంది. ప్రయోగాత్మక దశలో జరిగే కార్యకలాపాలను బక్సర్ జిల్లా యంత్రాంగం పర్యవేక్షిస్తుంది. అలాగే, భారత ప్రభుత్వ ప్రధాన వైజ్ఞానిక సలహాదారు కార్యాలయం కూడా ఈ పర్యవేక్షణను అజమాయిషీ చేస్తుంది.

ఏపీలో అదుపులోకి రాని కరోనా కేసులు

అమరావతి, ఆగష్టు 5:ఏపీలో లాక్ డౌన్ వైపు మళ్లీ అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే చిత్తూరు, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ నిబంధనలు అమలులోకి వచ్చేశాయి. మధ్యాహ్నం వరకే కొన్ని చోట్ల వ్యాపార కార్యకలాపాలకు అనుమతి ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో సాయంత్రం వరకే పర్మిషన్ ఇస్తున్నారు. మొత్తం మీద సెకండ్ వేవ్ ప్రారంభంలో ఎలా జరిగిందో.. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనపడుతోంది. అందువల్ల ఏపీ ప్రభుత్వం ముందు జాగ్రత్తగా నైట్ కర్ఫ్యూని కొనసాగిస్తోంది. రాత్రి 9గంటల వరకే షాపులు, 10 గంటల వరకు జన సంచారానికి అనుమతి ఉంది.

అయితే గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో కేసులు పెరుగుతున్న కొన్ని ప్రాంతాల్లో వీటికి అదనంగా మరికొన్ని గంటల పాటు కర్ఫ్యూ అమలులో ఉంటోంది. గుంటూరు నగరంలోని బ్రాడీపేట సహా ఇతర ప్రాంతాల్లో కొన్ని చోట్ల కంటైన్మెంట్ జోన్లు ప్రకటించారు. సెకండ్ వేవ్ పూర్తిగా తగ్గిపోలేదా..? లేక థర్డ్ వేవ్ మొదలైందా అనే సంశయం ఉండగానే.. అనుకోకుండా లాక్ డౌన్ ఆంక్షలు అమలులోకి రావడం గమనార్హం. ఏపీలో కొన్ని జిల్లాల్లో కరోనా రోజువారీ కేస

ఊడిపోయిన పులిచింతల డ్యామ్ గేటు.. పొంచి ఉన్న వరద ముప్పు

అమరావతి, ఆగష్టు 5:ఏపీలోని పులిచింతల డ్యామ్ నుంచి నీళ్లు వదులుతుండగా సాంకేతిక కారణాల వల్ల 16వ నంబర్ గేటు ఒక్కసారిగా ఊడిపోయింది. దీంతో ప్రకాశం బ్యారేజీకి నీరు వృథాగా పోతోంది. 1,65,763 క్యూసెక్కుల మేర నీరు దిగువకు వెళ్తున్నట్లు అధికారులు చెప్పారు. పులిచింతల ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో నీరు నిల్వ ఉండడంతో కొత్త గేటు అమర్చే పరిస్థితులు లేకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయంగా స్టాప్‌లాక్ పరిజ్ఞానంతో నీరు వెళ్లకుండా చేసేందుకు ప్రయత్నాలు జరపాలని భావిస్తున్నారు.

కాగా మంత్రి అనిల్ కుమార్ యాదవ్ పులిచింతల ప్రాజెక్టు వద్దకు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులతో ఆయన చర్చలు జరుపుతున్నారు. దీనిపై స్పందించిన కృష్ణా జిల్లా కలెక్టర్ జె.నివాస్? స్టాప్‌లాక్ గేట్‌తో పరిస్థితిని అదుపులోకి తీసుకొస్తామన్నారు. పులిచింతల డ్యామ్ గేటు ఊడిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

పేదలను ఆదుకోవడం అభినందనీయం

పరిగి, ఆగస్టు 5: పేదలను ఆదుకోవడం అభినందనీయమని పరిగి ఎంపీపీ కె.అరవిందరావు, మార్కెట్ చైర్మన్ సురేందర్‌లు అన్నారు. జన్ సాహస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పరిగి మండలం కాళ్లాపూర్ గ్రామంలో వారు నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో పేదలకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తూ ఉచితంగా రేషన్ సరుకులు అందిస్తుందన్నారు.

దీనికితోడు స్వచ్ఛంద సంస్థలు పేదలకు అండగా నిలవడం ద్వారా వారికి మేలు చేస్తున్నాయని పరిగి ఎంపీపీ కె.అరవిందరావు, మార్కెట్ చైర్మన్ సురేందర్‌లు పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలతో పేదలలో మనోధైర్యం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్, ఉపసర్పంచ్ జంగయ్య, జన్ సాహస్ సంస్థ ఉపాధ్యక్షుడు నవీన్, జిల్లా కో-ఆర్డినేటర్ ప్రకాష్, పీఏసీఎస్ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం : మంత్రి ఐకే రెడ్డి

నిర్మల్ , ఆగష్టు 5: డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేపడుతామని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద జరుగుతున్న వ్యర్థాల తొలగింపు పనులను గురువారం మంత్రి మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మున్సిపల్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుత.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మోరీల్లో చెత్తా చెదారం పేరుకుపోయిందన్నారు.

వ్యర్థాలను తొలగించి నూతనంగా మురికి కాలువలు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలక్రిష్ణ, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మజి రాజేందర్, టౌన్ ప్రెసిడెంట్ మరుగొండ రాము, విప్ నెరేళ్ల వేణు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

ఒక నిరుపేద ప్రాణాన్ని రక్షించండి

-దాతలు ముందుకు రావాలని కుటుంబ సభ్యుల ఆవేదన..

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 5:(నేటినిజం ప్రతినిధి): కొనరావుపేట్ మండలం బావుసా యిపేట గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్ గులియన్ బరే సిండ్రోమ్ అనే నరాల సంబంధిత వ్యాధితోబాధపడుతున్నాడు నిరుపేద కుటుంబానికి చెందిన వాడు కావడం తో వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి లో ఉన్నాడు. కావునా దయార్త హృదయులు స్పందించి సహాయం చేయగలరని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.ఇతని ట్రీట్ మెంట్ కొరకు 3 లక్షల రూపాయలు కావాలి అని డాక్టర్స్ చెప్పారని కుటుంబ కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు.ప్రస్తుతం ఇప్పుడు కరీంనగర్ లోని చంద్ర న్యూరో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు .

ఇతనికి భార్య ఒక కుమారుడు ఉండగా రెక్కాడితే డొక్కాడని పరిస్థితని దయచేసి తోచినంత సహాయం చేసి ప్రాణాన్ని కాపాడమని అంటున్నారు.

మానవతావాదులు,దయార్ద్ర హృదయులు స్పందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. సహాయకులు ఈ గూగుల్ పే ఫోన్ పే నంబర్ 770286 1333 ను సంప్రదించాలని కోరారు.

దళిత బంధుకు దండోరాతో చెక్!

హైదరాబాద్ , ఆగష్టు 5:హుజురాబాద్ ఉపఎన్నిక వేళ.. కేసీఆర్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా దళిత బంధు పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో టీ.పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కొత్త స్కెచ్ వేశారు. ముల్లును ముల్లుతోనే తీయాలని అన్నట్లు దళిత బంధు పథకాన్ని దళిత దండోరాతో చెక్ పెట్టాలని రేవంత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. దళిత బంధు పథకంపై ప్రజల దృష్టి పడకుండా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని రంగంలో దించబోతున్నారు. దళిత దండోరా గురించి రాహుల్ తో చర్చించానని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఈ కార్యక్రమాన్ని ఆయన రాబోతున్నట్టు వెల్లడించారు.

దళిత బంధు పేరుతో దళితుల కోసం కోట్లు రూపాయాలు ఖర్చు పెడుతున్నామని కేసీఆర్ సర్కార్ గొప్పలు చెప్పుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో హుజురాబాద్ ఉపఎన్నికలో ఓట్లు కొల్లగొట్టాలని యోచిస్తోంది. ముఖ్యంగా నియోజకవర్గంలో ఉన్న దాదాపు 50 వేల దళిత ఓటర్లను ఆకర్షించే పనిలో బీజీగా ఉన్నారు. దీంతో తెలంగాణలో అదే దళిత వర్గానికి చెందిన ప్రజలు పడుతున్న బాధలు, సమస్యలను రాష్ట్ర ప్రజలకు తెలిసేలా రేవంత్ ప్లాన్ చేస్తున్నారు. అందులో భాగంగానే దళిత దండోరా కార్యక్రమానికి రూపకల్పన చేశారు. జాతీయ మీడియా సైతం తెలంగాణవైపే చూసేలా రాహుల్ గాంధీని దళిత దండోరా కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ నెల 9నుంచి సెప్టెంబరు 17వరకూ జరిగే దళిత, గిరిజన ఆత్మగౌరవ దండోరాలో ఏదో ఒకరోజున రాహుల్‌గాంధీ పాల్గొంటారు. వరంగల్‌ను రాహుల్ సభకు ఎంచుకునే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఆ సభలోనే హుజూరాబాద్ అభ్యర్థిని ప్రకటించవచ్చని తెలుస్తోంది. రాహుల్‌గాంధీ 5 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

దళిత బంధు పథకాన్ని ఆగస్ట్ 16 నుంచి ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అంతకంటే ముందే ఆగస్ట్ 9 నుంచి దళిత దండోరా కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ చేపట్టనుంది. దళితులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు సహా వివిధ రకాలపై కాంగ్రెస్ పోరాటం చేయనుంది. హుజురాబాద్ బై పోల్ లో టీఆర్ఎస్ కు దళిత ఓట్లు పడకుండా అడ్డుకట్ట వేయాలన్నది రేవంత్ వ్యూహంగా తెలుస్తోంది.

మరోవైపు కాంగ్రెస్ కు సీఎం కేసీఆర్ ట్విస్ట్ ఇచ్చారు. ఆగస్ట్ 16 నుంచి దళిత బంధు పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తొలుత ప్రకటించిన కేసీఆర్? అనూహ్యం ఇప్పుడు దత్తత గ్రామం వాసాలమర్రి నుంచే తొలి పథకం పంపిణీకి శ్రీకారం చుట్టారు. అయితే, ఈ విషయంలో రేవంత్ మాత్రం అచితూచి వ్యవహరిస్తున్నారు. దళిత దండోరా కార్యక్రమం విజయవంతం చేసే బాధ్యతను కాంగ్రెస్ కార్యకర్తల మీదే పెట్టారు. ఆధిపత్యపోరుకు తావు లేకుండా, పార్టీ సమిష్టి నిర్ణయం మేరకే అన్ని పనులు జరగాలని హితబోధ చేశారు. సీఎం కేసీఆర్ దళిత బంధు పథకాన్ని చెప్పిన తేదీ కంటే ముందుగా ప్రారంభించినా.. దళిత దండోరాకు వచ్చిన నష్టం ఏమీ లేదనే ఆలోచనలో రేవంత్ ఉన్నారు. షెడ్యూల్ ప్రకారమే తమ పార్టీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. హుజురాబాద్ ఎన్నిక వేళ.. రాబోయే రోజుల్లో దళితులు టీఆర్ఎస్ వైపు ఉంటారా? లేక కాంగ్రెస్ వైపు ఉంటారా? అన్నది చూడాలి.

హుజురాబాద్ ఓట్లపైనే కేసీఆర్ కు ప్రేమ

హైదరాబాద్ , ఆగష్టు 5:ఉ

ద్యమకారులపై రాళ్ల దాడి చేసిన వ్యక్తికి ఎమ్మెల్సీ ఇచ్చారని విమర్శించారు. తెలంగాణలో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమ ద్రోహులు పార్టీలో చేరారన్నారు. ఉద్యమకారులకు కేసీఆర్ ఏ రకమైన గౌరవం ఇస్తున్నారో తేటతెల్లమైందన్నారు. కేసీఆర్ ఎప్పుడు ఎవరికి పట్టం కడతారో జనం అర్థం చేసుకోవాలని కోరారు. కేసీఆర్ కు హుజురాబాద్ ప్రజల మీద కంటే వారి ఓట్లపైనే ప్రేమ ఎక్కువ అని వ్యాఖ్యానించారు. ఓట్ల కోసం మూడేళ్ల ముందు ఇచ్చిన హామీలను ఇప్పుడు నెరవేరుస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌కు ఓట్ల మీద ప్రేమ లేకపోతే.. హుజూరాబాద్‌లో అమలు చేస్తున్న పథకాలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

హుజురాబాద్ లో రూ.150 కోట్ల నగదు వంపిణీ చేశారని ఈటల ఆరోపించారు. కేసీఆర్ ప్రజల్ని కాకుండా పైసల్ని నమ్ముకున్నారని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని మండిపడ్డారు. గతంలోనే తనను ఓడించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. టీఆర్ఎస్‌కు చరమగీతం పాడాల్సిన సమయం వచ్చిందన్నారు. దళిత బంధు పథకంతో పాటు బీసీల్లో కూడ ఆర్థికంగా వెనుకబడిన వారికి కూడ ఆర్థికంగా తోడ్పాటు అందించాలని ఈటల రాజేందర్ సీఎంను కోరారు. ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే ఈ కార్యక్రమాలను అమలు చేయాలని ఆయన కోరారు. అక్రమంగా సంపాదించిన వేల కోట్ల డబ్బును హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ ఖర్చు చేస్తోందని ఆయన ఆరోపించారు. వందల పోలీసులు మఫ్టీలో వచ్చి ఒక్కో కుటుంబాన్ని టార్గెట్

చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. 2018లో తనను ఓడించేందుకు పార్టీలోనే కొందరు నేతలు ప్రయత్నించారని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు. టీఆర్ఎస్ నేతలు ఎన్ని తాయిలాలు ఇచ్చినా ప్రజలు తీసుకొంటారు, కానీ ఓటు మాత్రం తనకే వేస్తానని చెబుతున్నారని ఈటల పేర్కొన్నారు.

వర్షం నీటి సంరక్షణపై రూపొందిన మోడల్ బిల్డింగ్ బై లాస్ , 2016ను అమలు చేస్తున్న 33 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు

న్యూఢిల్లీ, ఆగష్టు 5:వర్షం నీటిని ఒడిసి పట్టి రక్షించే అంశానికి కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రాధాన్యత ఇస్తున్నది. ఈ అంశాన్ని ఢిల్లీ యూనిఫైడ్ బిల్డింగ్ బై లాస్,మోడల్ బిల్డింగ్ బై లాస్ , 2016 మరియు పట్టణ మరియు ప్రాంతీయ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన మరియు అమలు కోసం రూపొందిన మార్గదర్శకాలు 2014లో చేర్చడం జరిగింది.వీటిని రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు తమతమ పరిస్థితులకు తగినట్టుగా అమలు చేయవలసి ఉంటుంది. మోడల్ బిల్డింగ్ బై లాస్ ప్రకారం 100 చదరపు మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన ప్లాట్ లో నిర్మించే నిర్మాణాలకు సంబంధించి అనుమతులు కోరుతూ సమర్పించే ప్లాన్లలో తప్పనిసరిగా వర్షపు నీటి సేకరణ ప్రతిపాదనను తప్పనిసరిగా చేర్చవలసి ఉంటుంది. వర్షం నీటిని ఒడిసి పట్టడానికి వీలు కల్పించే విధంగా భవన నిర్మాణ డిజైన్లను సిద్ధం చేయడాన్ని తప్పనిసరి చేస్తూ రూపొందిన నూతన భవన నిర్మాణ చట్టాలను 33 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు అమలు చేస్తున్నాయి.

పట్టణ ప్రాంతాల అభివృద్ధి అనేది రాష్ట్రాల పరిధిలోకి వచ్చే అంశం. దీనితో నీటిని ఒడిసి పట్టడం, సంరక్షించడం లాంటి అంశాలపై కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఎటువంటి సర్వేలను నిర్వహించదు. చట్టాలను రాష్ట్రాల ప్రభుత్వాలు అమలు చేయవలసి ఉంటుంది.

జల సంరక్షణ మరియు వర్షం నీటి సంరక్షణపై అవగాహన కల్పించడానికి 2019లో జల సంరక్షణ అభియాన్ కార్యక్రమాన్ని జల సంరక్షణ మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చురుగ్గా పాల్గొని దీనికోసం సమాచార, విద్య మరియు కమ్యూనికేషన్ కార్యక్రమాలనురూపొందించింది. జల సంరక్షణ, వర్షం నీటి సంరక్షణ, శుద్ధి చేసిన వ్యర్థ జలాలను తిరిగి వినియోగించడం, వనరుల పునరుజ్జీవం, మొక్కలను నాటడం లాంటి కార్యక్రమాలను అమలు చేయడానికి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను రూపొందించింది.

జల్ శక్తి అభియాన్ తో పాటు ప్రజలకు జల వనరుల సంరక్షణపై అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులను చేయడానికి 'వర్షం నీటిని ఒడిసి పట్టు' కార్యక్రమం కూడా అమలు జరుగుతున్నది. 2021 మార్చి 22వ తేదీన ఈ కార్యక్రమాన్ని' వర్షం కురిసినప్పుడు అది కురిసే చోట వర్షం నీటిని పట్టు' అనే నినాదంతో అమలు చేయడం జరుగుతున్నది. చెక్ డ్యామ్‌లు,ఇంకుడు గుంటలు , ఇళ్ల మిద్దెలపై వర్షం నీటి సంరక్షణ సదుపాయాలను కల్పించడంతో పాటు చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి ఆక్రమణ ,పూడికలను తొలగించి ఎగువ ప్రాంతాల నుంచి నీరు పారేలా చేయడం, మెట్ల బావులకు మరమ్మతులు చేయడం మరియు పనికిరాని బోర్-బావులు మరియు ఉపయోగించని బావులను ఉపయోగం లోకి తేవడం జలవనరులను సంరక్షించడానికి ప్రజల సహకారంతో కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతున్నది.

టీటీడీ ఉద్యోగుల నగదు రహిత వైద్యం కోసం ప్రత్యేక నిధి: ఈఓ జవహర్ రెడ్డి

తిరుపతి, ఆగస్టు, ఆగష్టు 5:తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు, చికిత్సలు అందించడానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని ఈఓ డా.కెఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి ఆయన సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఉద్యోగి రిటైర్మెంట్ రోజే అతనికి రావాల్సిన అన్ని ప్రయోజనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సర్క్యులర్ జారీ చేశామని చెప్పారు. దీన్ని ఖచ్చితంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు.

బ్రహ్మోత్సవాల నాటికి తిరుమలలో ఉద్యాన వనాలన్నీ అభివృద్ధి చేసి భక్తులకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయాలని జవహర్ రెడ్డి చెప్పారు. ఘాట్ రోడ్లలో విరిగి పడిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తిరుమలలో

అవసరమైన చోట కాటేజీల రూఫ్ పై సోలార్ సిస్టం ఏర్పాటు చేసి యాత్రికులకు వేడి నీళ్లు అందించాలని ఆయన అన్నారు. అలిపిరి ఫుట్ పాత్ పైకప్పు నిర్మాణం పనులు, కాటేజీల అభివృద్ధి పనులపై ఈవో సమీక్షించారు.

వైజాగ్‌లో టీటీడీ ఆలయ నిర్మాణం పూర్తి.. ఆగస్టు 13న ప్రారంభోత్సవం!

విశాఖపట్నం, ఆగష్టు 5: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వైజాగ్‌లోని రుషికొండ బీచ్ సమీపంలో తలపెట్టిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం పూర్తైంది. ఆగస్టు 13వ తేదీన ఆలయాన్ని ప్రారంభించనున్నట్లుగా ప్రాథమిక సమాచారం. ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగర్ మోహన్ రెడ్డి హాజరయ్యే అవకాశం. పది ఎకరాల్లో రూ.26 కోట్ల వ్యయంతో ఆలయ నిర్మాణం గావించారు. మహా సంప్రోక్షణ, ఇతర పూజాది కార్యక్రమాలు ఆగస్టు 9 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. తిరుమల శ్రీవారి ఆలయం వలె ఇక్కడి ఆలయాన్ని నిర్మించారు. వెంకటేశ్వరస్వామి వారికి ఎదురుగా హనుమాన్ విగ్రహం కొలువుదీరింది. అదేవిధంగా శ్రీదేవి, భూదేవి ఆలయాలను స్వామి ఆలయానికి పక్కనే నిర్మించారు. ఓ ధ్యాన మందిరం, వివాహాల కోసం బ్యాంకట్ హాల్‌ను ఏర్పాటు చేశారు. సందర్శకుల సౌకర్యార్థం బీచ్ రోడ్ నుండి టెంపుల్ వరకు ఘాట్ రోడ్‌ను నిర్మించారు. తిరుమల ప్రధాన ఆలయం వలె ఇక్కడా అన్ని పూజాది కార్యక్రమాలు జరగనున్నాయి.

ఆహార భద్రత కావాలంటే నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలి : ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ, ఆగష్టు 5: దేశ ఆహార భద్రతను కాపాడాలంటే గత సంవత్సరం తీసుకువచ్చిన నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆహార భద్రత పథకం లబ్దిదారులతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడేకంటే ముందు ప్రియాంక గాంధీ ట్విట్టర్ ద్వారా స్పందించారు. కరోనా సంక్షోభం సమయంలో సైతం రైతులు పంటలు పండించి ఆహార ధాన్యాల కొరత లేకుండా చూశారన్నారు. వ్యవసాయ చట్టాల రద్దుతో రైతుల ఆత్మగౌరవాన్ని తిరిగి పునరుద్ధరించాలన్నారు.

దేశ ఆహార భద్రతకు ముప్పు కలిగించే నల్ల వ్యవసాయ చట్టాలను మోదీ తీసుకువచ్చారన్నారు. దేశ ఆహార భద్రతను కాపాడాలంటే, ఈ వ్యవసాయ చట్టాలను రద్దు చేయడం ద్వారా రైతుల గౌరవాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ నుండి వచ్చిన రైతులు కేంద్రం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా గత ఏడాది నవంబర్ నుండి ఢిల్లీ సరిహద్దుల్లో క్యాంప్ వేసి నిరసన చేపడుతున్నారు. వీరిలో 200 మంది రైతుల బృందం సెంట్రల్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనను చేపట్టింది.

ఆత్మగౌరవ లోగిళ్లు.. మన డబుల్ బెడ్ రూం ఇండ్లు

జగిత్యాల, ఆగష్టు 5:: ఆత్మగౌరవ లోగిళ్లు.. మన డబుల్ బెడ్ రూం ఇండ్లు అని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పడకల్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంత్రి బుధవారం ప్రారంభించారు. అదేవిధంగా సీసీ రోడ్లు, వైకుంఠ దామం, సైడ్ డ్రైనేజీలు, గోపాల మిత్ర భవనం, పల్లె ప్రకృతి వనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి-ప్రజా సంక్షేమం ప్రభుత్వానికి రెండు కండ్లు అన్నారు. తెలంగాణలోని నిరుపేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉండే విధంగా సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇస్తున్నారని తెలిపారు.

రాష్ట్ర పరిపాలన దేశానికే ఆదర్శంగా ఉందన్నారు. మన సీఎం కేసీఆర్ రూపొందించిన పథకాలను దేశం ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నదన్నారు. ఏడవ విడత హరితహారంలో భాగంగా రైతు వేదిక ఆవరణలో మంత్రి మొక్కలు నాటారు. కొత్తపేట ఎస్సీ కాలనీ వాసులతో వారి ఇండ్ల ముందే కూర్చుని పలు సమస్యలపై మంత్రి చర్చించారు.

పథకాలకు డబ్బులు లేవు.. మరి మేఘ ప్రాజెక్టుకు ఎలా?

హైదరాబాద్ , ఆగష్టు 5:సీఎం కేసీఆర్‌పై వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల్ మండిపడ్డారు. రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్టు .. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణ ఖర్చు రోజురోజుకు పెంచుకుంటూ పోతున్నారని ఆరోపించారు. రూ.38,500 కోట్లతో మొదలై.. రూ.లక్షా 20 వేల కోట్లకు చేరిందన్నారు. ఒకవైపు ఉద్యోగుల జీతాలకు, రైతు రుణమాఫీకి డబ్బులు లేవన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కు పైసలు లేవని, సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే భూములు అమ్ముకోవాలని పేర్కొన్నారు. మేఘా ప్రాజెక్టులకు డబ్బులు కట్టబెట్టడానికి మాత్రం .. అప్పులు చేసి మరి కేసీఆర్ దొర పైసలు కుమ్మరిస్తారని ఆరోపించారు. '' మీది దేశంలోనే అద్భుత "మేఘ" పరిపాలన దొర గారు" అని షర్మిల వ్యాఖ్యానించారు.

అంత్యక్రియులకు గజం జాగా లేదు

హైదరాబాద్ , ఆగష్టు 5:ప్రతి గ్రామంలో మృతి చెందిన వారికి గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రభుత్వం వైకుంఠ దామాలు నిర్మించింది. కానీ హైదరాబాద్ కు అతి సమీపంలో ఉన్న ఓ గ్రామంలో మాత్రం మనిషి చనిపోతే కాల్చేందుకు స్థలం లేదు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ పరిధిలోని పెద్దగుట్ట తండాలో బద్రు నాయక్ అనే గిరిజన వృద్ధుడు నిన్న రాత్రి మృతి చెందాడు. బద్రు నాయక్ అంత్యక్రియల కోసం కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేశారు. అయితే తండాలో చనిపోయిన వ్యక్తికి కనీసం కాష్టం చేయడానికి కూడా గజం జాగా లేకపోవడంతో విస్మయానికి గురి చేస్తోంది.

గతంలో స్థానికంగా ఉన్న మూడు తండాలకు సంబంధించి అధికారులు ఓ దగ్గర 5 గుంటల భూమిని కేటాయించారు. బద్రు నాయక్ శవాన్ని అక్కడకు తీసుకెళ్లగా.. స్థానిక తండా వాసులు అడ్డుకున్నారు. దీంతో కుటుంబసభ్యులు ట్రాక్టర్ లో కట్టెలతో మరో ప్రాంతానికి తీసుకెళ్లారు. అలా మూడు స్థలాలు తిరిగినా అంత్యక్రియలకు ఒప్పుకోని పరిస్థితి ఎదురైందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన వ్యక్తికి అంత్యక్రియలు చేసేందుకు జాగా లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ బోణాల పండుగ ఔనత్యం

తెలంగాణ రాష్ట్రంలో గొప్పగా జరుపుకునే పండుగలలో బొనాల పండుగ కూడా ఒకటి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక బొనాలను రాష్ట్ర పండుగగా గుర్తించడం జరిగింది. ఈ పండుగలో గ్రామ దేవతలు అయిన యల్లమ్మ,పోచమ్మ, మైసమ్మ, పోలేరమ్మ, మాంకాలమ్మ, నవారు లచ్చమ్మ, అంకాలమ్మ, పెద్దమ్మ దేవతలను పూజిస్తారు. ఆషాడ మాసంలో ఈ పండుగను అంగరంగా వైభవంగా జరుపుకుంటారు. ముఖ్యంగా ఎల్లమ్మ దేవతను పూజిస్తారు.

బోజనం లేదా భోణం: ఈ పండుగలో ప్రధాన ఆకర్షణ బొణం. దేవతలకు సమర్పించే నైవేద్యాన్ని (ఆహారాన్ని,ప్రసాధాన్ని) బోణం అంటారు. పాలు పెరుగు పసుపు తో కలిపి నైవేద్యాన్ని తయారు చేస్తారు,పసుపు కుంకుమ సుద్దతో అందంగా అలంకరించిన మట్టి కుండలో ఈ నైవేద్యాన్ని ఉంచి,భోణం పైన వేప కొమ్మలతో అలంకరిస్తారు. మహిళలు కొత్త చీరలను ధరించి తలపై బోణం పెట్టుకొని డప్పు చప్పులతో,చిరుతల భజనతో గుంపుగా అమ్మవారి గుడికి భయలుదేరుతారు. వీరితో పాటు శరీరంపై పసుపు,నుదుటిపై కుంకుమ,గజ్జెలతో తయారు చేసిన దోవతిని,కాలికి గజ్జెలు ధరించి డప్పు చప్పుల్లకు అనుగుణంగా నాట్యం చేస్తు,నడుముకు వేపాకులను చుట్టుకొని,కొరడాతో బాదుకుంటు పోతరాజు కూడా అమ్మవారి గుడికి బయలు దేరుతాడు. ఇతనిని అమ్మవారి సోదరునిగా భావించి ఇతని చేతుల మీదుగా పండుగను జరిపించడం జరుగుతుంది.

ఈ ఉత్సవంలో పాల్గోను కొంత మంది మహిళలను అమ్మ వారు ఆవహిస్తుందని నమ్మకం. పూనకంలో ఉన్న మహిళ భక్తులు రౌద్రాన్ని ప్రదర్శిస్తారు వీరిని శాంతింప చేయడానికి మిగతా మహిళలు వారి పాదాల మీద నీళ్ళు పోస్తారు. పూనకంలో ఉన్న భక్తురాలు భవిష్యవాణి చెబుతారు. వీరి చేత భక్తులు తమ భూత భవిష్యత్ కాలాలు ఎలా ఉంటాయి తెలుసుకొనుటకు భవిష్యవాణి చెప్పించుకుంటారు. తమ మీద కాని తమ కుటుంబం మీద కాని ఏమైన దుష్ట శక్తులు ఉంటే వీరు ఇచ్చే పసుపు కుంకుమలను తమ నుదిటిపై ధరిస్తే అవి పోతాయని నమ్మకం బోనాలు పండుగ దేవికి నైవేద్యము సమర్పించు పండుగ కావడం చేత, ఆ ప్రసాదాన్ని కుటుంబ సభ్యులు అతిథులతో పాటు స్వీకరిస్తారు. నివేదనానంతరం మాంసాహార విందు భోజనం మొదలౌతుంది. పండుగ జరిగే ప్రాంతాలలో వేపాకులతో అలంకరించబడిన వీధులు దర్శనమి స్తాయి. జానపద శైలిలో ఉండే అమ్మవారి కీర్తనలతో నిండిన మైకుసెట్ల హోరులో పండుగ వాతావరణం సంతరించుకుంటుంది. రంగం, పండుగ రెండవ రోజు ఉదయం జరుగుతుంది. ఈ రంగం కార్యక్రమంలో పోతరాజు వేషం వేసిన వ్యక్తికి పూనకం వస్తుంది. ఆ విక్రుతమైన కొపాని తగ్గించెందుకు అక్కడవున్న భక్తులు కొమ్ములు తిరిగిన మేకపోతును అందిస్తారు. పొతరాజు తన దంతాలతో ఆ మేక పోతును కొరికి, తల, మొండెం వేరు చేసి పైకి ఎగురవేస్తాడు (గావు పెట్టడం). ఈ కార్యక్రమం జాతర ఊరేగింపు తరువాత జరుగుతుంది.

బోనాలు :

భోజనం ప్రకృతి. బోనం వికృతి. బోనం అంటే భోజనం. జానపదులు తమకు ఇష్టమైన గ్రామదేవతలకు సమర్పించే నైవేద్యమే బోనం. దీన్ని కొత్తకుండలో వండి ప్రదర్శనగా వెళ్లి గ్రామదేవతలకు భక్తిప్రపత్తులతో సమర్పిస్తారు. చిన్నముంతలో పానకం పోస్తారు. దానిపై దివ్వె పెట్టి బోనంజ్యోతి వెలిగించి జాతర కన్నులపండుగా నిర్వహిస్తారు. వేటపోతు మెడలో వేపమండలుకట్టివ్యాధి నిరోధకశక్తిని పెంచే పసుపు కలిపిన నీరు, వేపాకుల్ని చల్లుకుంటూ భక్తులు ఊరేగింపుగా గ్రామదేవతల ఆలయాలకు తరలివెళ్లి బోనాలు సమర్పిస్తారు. ఇలా బోనాల సమర్పణ వల్ల దేవతలు శాంతించి అంటువ్యాధులు రాకుండా కాపాడుతారని ప్రజల విశ్వాసం అమ్మవారి ఆకారములో అలంకరింపబడిన రాగి కలశాన్ని ఘటం అని సంబోధిస్తారు. సాంప్రదాయక వస్త్రధారణ, ఒంటి పై పసుపు కలిగిన పూజారి ఈ ఘటాన్ని మోస్తాడు. పండుగ మొదటి రోజు నుండి, చివరి రోజు నిమజ్జనం దాకా ఈ ఘటాన్ని డప్పుల మేళవాద్యాల నడుమ ఊరేగిస్తారు. ఘటం ఉత్సవం రంగం తర్వాత జరుగుతుంది.

అశ్వాల మధ్య, అక్కన్న, మాదన్నల బొమ్మల నడుమ ఊరేగింపు మొదలయ్యి సాయంత్రానికి కన్నుల పండుగగా నయాపుల్ వద్ద ఘటముల నిమజ్జనతో ముగుస్తుంది. లాల్‌దర్వాజా నుండి నయాపుల్ వరకు వీధుల వెంబడి వేలాదిమంది ప్రజలు నిలుచుని రంగ రంగ వైభవంగా అలంకరించబడిన ఘటాలను చూస్తారు. పోతురాజుతో పాటు, వివిధ పౌరాణిక వేషధారణలలో ఉన్న కుర్రవాళ్ళు తమదైన రీతిలో జానపదగీతాలు, వాయి ద్యాల మధ్య నృత్యం చేస్తారు. ఓల్డ్‌సిటీలో జరిగే ఘటాల ఊరేగింపులో హరిబౌలి అక్కన్న మాదన్న, లాల్‌దర్వాజా ఉప్పుగూడ, మిరాలం మండీ, కాసరట్టలలోని మహంకాళి ఆలయాలు, సుల్తాన్‌షాహీలోని జగదాంబాలయం, షాలి బండ, అలీజా కోట్లా, గౌలీపురా, సుల్తాన్‌షాహీలోని బంగారు మైసమ్మ దేవాలయాలు, ఆలియాబాదులోని దర్బారు మైసమ్మ మందిరం, చందూలాల్ బేలాలోని ముత్యాలమ్మ గుడి పాల్గొంటాయి.

బోనాల పండుగ జరుపుకోవడానికి గల కారణాలు:

మన తెలంగాణ పండుగలలో బోనాల పండుగ కూడా ఒకటి. తెలంగాణ ప్రజలు చాలా సంతోషంగా జరుపుకునే పండుగ. ముఖ్యంగా మన భాగ్యనగరం (హైదరాబాద్), లస్కర్ (సికింద్రాబాద్) జంట నగరాల్లో జరిగే బోనాల పండుగ అంగరంగవైభవంగా జరుగుతుంది. అందుకే మన తెలంగాణ ప్రభుత్వం బోనాల పండుగను రాష్ట్ర పండుగగా

గుర్తించింది. మొదట గోల్కొండ జగదాంబిక ఆలయంలో ప్రారంబమై తరువాత సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాల పండుగాను నిర్వహిస్తారు ఆతరువాత చివరగా లాల్ దర్వాజ సింహవాహిని ఆలయంలో, ఇతర చోట్ల నిర్వహిస్తారు ఆషాఢమాసంలో ఈ బోనాల పండుగ తెలంగాణ ప్రాంతాలలో ఆనందంగా జరుపుకుంటారు . బోనాల పండుగలో ఎన్నో శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. అసలు ఈ పండుగ నిర్వహించడానికి గల కారణాలు వాటిలో మనం కొన్ని ముఖ్యమైనవి తెలుసుకుందాము.

బోనం:

బోనం అంటే భోజనం అని అర్థం. ఆ భోజనాన్ని ఆషాఢమాసంలో అమ్మవారికి నైవేజ్యంగా పెట్టడం ఆచారంగా వస్తున సంప్రదాయం. ముందుగా ఆ బోనాన్ని ఒక మట్టి కుండలో వండుతారు ఆలావండిన కుండకి సున్నము, పసుపు, కుంకుమ, వేపాకులు కూడా పెడ్తారు అలాగే ఆ కుండా పై ఒక దీపాన్ని ఉంచుతారు. ఇలా వండిన బోనం ఎంత పవిత్ర మైందంటే అంతే శుభ్రమైనది కూడా. ఆలా వండిన బోనానికి సున్నం, పసుపు, వేపాకులు పెట్టడం వలన ఎటువంటి చెడు క్రిమి కీటకాలు రావు. ఇందులో వాడిన సున్నం, పసుపు, వేపాకులు ఇవ్వన్ని యాంటీ సెప్టిక్, యాంటీ బైయోటిక్ కి సంబంధించినవే కాబట్టి ఇందులోకి ఎటువంటి క్రిమి కీటకాలకు బోనం లోపలికి వెళ్ళే అవకాశం లేదు. అందువలన ఈ బోనానికి ఇంతపవిత్రత, శుభ్రత ఉంటుంది. అలాగే మనం బోనం పై దీపం ఎందుకు పెడతారంటే ఒకవేళ మనం బోనం ఎత్తుకొని వెళ్ళే దారి కనుక చీకటిగా ఉంటే అప్పుడు మనకు ఆ దీపమే మనకు త్రోవ్వ చూపిస్తుంది అంటే దారిలో వెలుగుల అనమాట .ఇది బోణం యొకా ప్రత్యేకత.

ఆషాఢ మాసంలో పండగ ఎందుకు చేస్తారు:

మనకు ముఖ్యంగ వానా కాలం ఆషాఢ మాసంలో మొదలై శ్రావణ మాసం భద్రపద మాసంలో ముగుస్తుంది. వానాకాలంలో మనకు కలరా,మలేరియా వంటి అంటు వ్యాధులు చాల త్వరగ వ్యాపిస్తాయి . వానా కాలంలో వచ్చే అంటూ వ్యాధులు చాలా ప్రమాదకరం. సాధారణంగా ఈ అంటు వ్యాధులు క్రిమి కీటకాలతో పాటు ఇతర ప్రమాద జంతువుతో వచ్చే ప్రమాదంకూడా ఉంది. అందువల్ల ఆషాఢ మాసంలో ఈ బోనాల పండుగ జరుపుకుంటారు. అలాగే ఈ ఆషాఢ, శ్రావన మసాల్లో మహిళలు కాళ్లకు పసుపు పెట్టుకుంటారు ఎందుకంటే వానాకాలంలో మహిళలకు అరి కాళ్ళు చెడుతయీ అలా కాకుండా మహిళలు పసుపును కళ్ళకు పెట్టుకుంటారు అసలు పండగకు ఆషాఢ మాసానికి సంబంధం ఏంటంటే బోనాల పండుగకు అలంకారంగా ప్రతి ఇంటి గుమ్మాలకు, ప్రతి వీధి వీధికి వేపాకు మండలు కడ్తారు కనుక ఆ వేపాకులో ఆ వేపాకులో ఉండే గుణం ఆ క్రిమి కీటకాలను నాశనంచేస్తుంది కాబట్టి ఈ పండగలో వేపాకులు ప్రదానంగా వాడుతారు. వేపాకులో ఉన్న గుణం వల్ల ఎటువంటి అంటూ వ్యాధులు మనకు రావు.

బోనాల పండుగలో ముఖ్యమైనది బలి. ప్రధానంగా బోనాల పండుగకు మేకలను, గొర్రెలను, కోళ్లను అమ్మవారికి బలి ఇస్తారు. ఈ బలికి కూడా శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. సాధారణంగా ఈ ఆషాఢ మాసంలో మొదలైయే వానా కాలం వలన వచ్చే అంటూ వ్యాధులు మనుషుల కన్నా ముందు కోళ్లకు, మేకలకు, గొర్రెలకు మొదలైన వాటికి త్వరగా సోకే అవకాశం ఉంది కనుక ఆ వ్యాధి సోకక ముందే వాటిని బలిస్తారు. బహుశా అందువలననేమో శ్రావణ మాసం లో కొంత మంది మాంసాహారం తినరు.

అమ్మవారి ఊరేగింపు

బోనాల పండుగలో ముఖ్యమైన ఘట్టం అమ్మవారి ఊరేగింపు. ఊరేగింపు సమయంలో అమ్మవారి రథం ముందు డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, వేపాకులతో పాటు, గుగ్గిలం లేదా మైసాచి పొగలు వేస్తారు. ఈ ఊరేగింపుకి కూడా కారణాలు ఉన్నాయి ఊరేగింపు సమయంలో డప్పు చప్పుళ్లు ఆ చప్పుళ్లతో పాటు పోతరాజులు నృత్యం చేస్తూ అరుస్తారు. అప్పుడు ఆ డప్పు చప్పుడు పోతరాజుల అరుపుకు ఊర్లో ఉన్న కొన్ని ప్రమాదకరమైన జంతువులు భయంతో పారిపోతాయి.

గుగ్గిలం లేదా మైసాచి పొగలి

అమ్మవారి ఊరేగింపు సమయంలో అమ్మవారికి గుగ్గిలం లేదా మైసాచి పొగ వేస్తారు. ఇంతకు పొగ ఎందుకు వేస్తారంటే. వానా కాలంలో దోమలు, ఇతర కీటకాలు చాల వ్యాపిస్తాయి . అప్పుడు ఆ పొగ వల్ల అటువంటి క్రిమి కీటకాలు చనిపోతాయి అందువలన అమ్మవారికి మైసాచి లేదా గుగ్గిలం పొగలు వేస్తారు .మన దేశ భవిష్యత్తు తరాల కోసం మన సనర్వన ధర్మాన్ని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుదాం. మన దేశ ఔన్యత్యాన్ని పెంచుదామ్.

-పులిగిల్ల ఉపేందర్
ఓ.యు
సెల్:9573784198

తెలంగాణ ఉద్యమకర్త

చీకటి కమ్మిన కాలాన్ని చీల్చుకుంటూ
దేశపుఅంచుమీద కవాతుచేసినవాడు
తెలంగాణ పితామహుడు జయశంకర్ ॥

దిక్కరిస్తూనే రాజకీయపు అరాచకాలపై
కాంద్రించి ఉమ్మిన ప్రశ్నల బాణం
ప్రశ్నించేఉద్యమనేత మనజయశంకర్

పోరాట పౌరుషాన్ని పిడికిల్లో బిగించి
రాష్ట్రసాధనకై రక్తాన్ని ధారపోసినవాడు
పోరాటానికి అసలైన వారసత్వంజయశంకర్.

విసిరేఖడ్గమై వ్యవస్థను ఖండిస్తూనే
తెలంగాణ అవతరణకై అవతరించినవాడు
మరణంలేనిఅమరుడు మనజయశంకర్

వందలాది అమరవీరులు సమిధలై
అరవైఏళ్ల ప్రాణత్యాగాల ఫలితం తెలంగాణ
తెలంగాణపుట్టుక కారకుడు జయశంకర్

-పోలె వెంకటయ్య
9951914867

ప్రజల సేవకు అంకితం కావాలి

పోలీసు అధికారులు నిత్యం ఫంక్షనల్ వర్టికల్స్ అమలును పర్యవేక్షించాలి-జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 5:(నేటినిజం ప్రతినిధి): పోలీసులు నిబద్ధత తో విధులు నిర్వహిస్తూ ప్రజా సేవకు అంకితం కావాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. గురువారం రోజున జిల్లా ఎస్పీ సిరిసిల్ల రూరల్ పరిధిలోని ఇల్లంతకుంట, ముస్తాబద్ పోలీస్ స్టేషన్ లను వార్షిక తనిఖీల్లో భాగంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్ కౌంటర్ పనితీరుకు సంబంధించిన వివరాలను, స్టేషన్ లో నమోదయ్యే కేసులు, స్టేషన్ పరిధిలో సి.సి కెమెరాల పనితీరుతో పాటు నేరాల నియంత్రణ,స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసుల వివరాలు పెండ్డింగ్ మరియు లాంగ్ పెండ్డింగ్ కేసుల వివరాలను సంబంధిత అధికారులను జిల్లా ఎస్పీ అడిగితెలుసుకొని కేసులలో మరింత ముందుకు వెళ్లుటకు తగు సూచనలు చేశారు .అనంతరం ఎస్పీ మాట్లాడుతూప్రజలు అందించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, ప్రజల నమ్మకానికి తగ్గట్లుగా పనిచేసి ప్రజల అభిమానాన్ని పొందాలని, శాంతిభద్రతల పరిరక్షణ కొసం నిరంతరం అప్రమత్తంగా వుండాల్సిన భాధ్యత మనపై వుందని అని అన్నారు. పోలీస్ స్టేషన్లో ఫంక్షనల్ వర్టికల్స్ అమలు తీరును రిసెప్షన్, పనితీరు,100డయల్ ఎంత సమయంలో స్పందిస్తున్నారు, కోర్టు, సమన్స్, స్టేషన్ రైటర్, బ్లూ కోల్ట్స్ వర్టికల్స్ అమలుతీరును పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు పోలీస్ స్టేషన్లో ఫంక్షనల్ వర్టికల్స్ గురించి ఎస్సైలు నిత్యం పర్యవేక్షించి పక్కాగా అమలు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూబాధ్యతాయుతంగా ఉంటూ ప్రజలతో స్నేహపూర్వకంగా క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. కేసులు పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు దర్యాప్తు పూర్తిచేసి న్యాయస్థానంలో నిందితులను ప్రవేశపెట్టాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని నేరదర్యాప్తులో పురోగతి సాధించి పోలీస్ శాఖలో విప్లవాత్మకంగా మార్పులు తీసుకురావాలని సూచించారు. టెక్నాలజీ సహాయంతో మండలంలో ఎక్కువగా నేరాలు చోటుచేసుకునే ప్రాంతాల సమగ్ర సమాచారాన్ని గుర్తించాలని సూచించారు.

ఇల్లంతకుంటా పోలీస్ స్టేషన్ పరిధిలో సి.ఐ,ఎస్.ఐ

లు పెద్ద మొత్తం లో చెట్లు నాటి మోడల్ పోలీస్ పార్క్ ఏర్పాటు చేస్తామని అన్నారూ అని ఎస్పీ తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్ ల ఆవరణలో సిబ్బంది తో కలసి ఎస్పీ మొక్కలు నాటారు. ఎస్పీ వెంట సి.ఐ ఉపేందర్, ఎస్.ఐ లు రఫీక్ ఖాన్,వెంకటేశ్వర్లు, ప్రొహిబిషనరీ ఎస్.ఐ లు దీలిప్, నిస్సార్ పాషా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి..!

-శాసన మండలి ప్రొటెం స్పీకర్ భూపాల్ రెడ్డి

సంగారెడ్డి, ఆగస్టు 5 (నేటినిజం ప్రతినిధి) బుధవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ అధ్యక్షతన జెడ్ పి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ముఖాల్లో సంతోషం కనిపించేలా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలతో ముందుకెళ్తుందని అన్నారు. రాష్ట్రంలో చేపట్టిన పల్లె ప్రగతి పట్టణ ప్రగతిపై ఇతర రాష్ట్రాలు బాగుందని అంటున్నారనీ పేర్కొన్నారు.

గ్రామపంచాయతీ లలో ఉన్న ఇబ్బందుల గురించి ఆలోచించాల్సిన ఆవశ్యకత ఉందని, దానిపై దృష్టి సారించాలని కలెక్టర్ను కోరారు.

మత్తుపదార్థాల అక్రమ రవాణాపై అందరూ దృష్టి సారించాలని, యువతను మత్తుపదార్థాల బారిన పడకుండా కాపాడాలన్నారు. గంజాయి, డ్రగ్స్ అరికట్టడంపై వీలైనంత త్వరగా ఆయా శాఖల తో సమావేశం ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ను కోరారు.

ఈ సమావేశంలో భాగంగా వ్యవసాయం, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, ఆర్ అండ్ బి, నీటిపారుదల, తదితర శాఖల ప్రగతిని ఆయా శాఖల అధికారులు సభలో వివరించారు.

ఈ సందర్భంగా పలువురు సభ్యులు వివిధ అంశాలపై తమ పరిధిలో ఉన్న సమస్యలను చైర్పర్సన్ దృష్టికి తీసుకు వచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్ మంజుశ్రీ జైపాలెడ్డి మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించడంలో అందరూ సహకరించాలని కోరారు.

జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు అయిందని , జిల్లా అన్నివిధాల అభివృద్ధి చెందుతుందన్నారు.

జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ రెవిన్యూ సమస్యలు పరిష్కరించడంలో జిల్లా ముందు స్థానంలో ఉందన్నారు. జిల్లాలో 45వేల రెవెన్యూ సమస్యలకు గాను 39 వేల దరఖాస్తులను పరిష్కరించామని, వివిధ కేటగిరీలలో ఇంకా సుమారు 6 వేల దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. ఏ సమస్య ఉన్నా మీసేవ కి వెళ్లి అన్ని అప్లోడ్ చేయించాలని సూచించారు. త్వరలో అన్నింటినీ పరిష్కరించే దిశగా పనులు జరుగుతున్నాయన్నారు.

యువత గంజాయికి బానిసలు కావడం శోచనీయమన్నారు. దీనిని అరికట్టాలనీ, గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వారిపై పి.డి యాక్ట్ కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సూపరిండెంట్ కు సూచించారు. వెంటనే కంట్రోల్ రూమ్ ను తెరిచి, గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, సరఫరా, అమ్మకాలకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ప్రజలకు తెలియజేయాలన్నారు.

కోవిడ్ రెండో విడత ప్రభావం చాలా చూపిందని, మూడో వేవ్ వచ్చే అవకాశాలున్నాయని నిపుణులు చెప్తున్న దృష్ట్యా నారాయణఖేడ్ జహీరాబాద్ బార్డర్ చెక్ పోస్టులలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా చైతన్య పరచాలని, అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

నారాయణఖేడ్ శాసనసభ్యులు భూపాల్ రెడ్డి మాట్లాడుతూ రెండు వందల ఎకరాల అసైన్డ్ ల్యాండ్ ప్రొహిబిటెడ్ లో ఉందని, అందులో పట్టా భూమి వుందని, అట్టి పట్టా భూమినీ క్లియర్ చేయాలని కలెక్టర్ను కోరారు.

జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావు , దరఖాస్తులను తిరస్కరించినప్పుడు ఎందుకు రిజెక్ట్ చేస్తున్నది వివరన ఇవ్వాలని సూచించారు.

పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు భూ సంబంధిత సమస్యల పరిష్కారం, రోడ్ల నిర్మాణం, డాక్టర్ల డిప్యుటేషన్ ల రద్దు, వైద్య సిబ్బంది కేటాయింపు, పూర్తయిన పనులకు వెంటనే డబ్బు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, గ్రామపంచాయతీ భవనాల మంజూరి, అన్ని గ్రామ పంచాయితీలలో కోవిడ్ వ్యాక్సిన్ మొదటి డోసు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, నారాయణఖేడ్ లో 50 పడకల మాతాశిశు ఆసుపత్రి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా గ్రామాల్లో సర్వే చేసి ప్రజా ప్రయోజనాలకు కేటాయించాలని కోరారు.

గ్రామ పంచాయితీ నిధులలో ఆడిటర్ పర్సంటేజీ వసూలు చేస్తున్నారని, తీసుకున్న డబ్బులు తిరిగి ఇప్పించాలని, డివిజినల్ పంచాయితీ అధికారి అవినీతికి తెరలేపారని జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్

ఆరోపించారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రొటెం చైర్మన్ కలెక్టర్కు చెప్పారు.

తన భర్త ఎంపీడీవో వేధింపులతో ఇటీవలే గుండెపోటుతో చనిపోయాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ సంగారెడ్డి ఎంపీపీ సభలో కన్నీరు కార్చారు.

న్యాయం చేస్తామని చైర్పర్సన్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్, ఎంపీపీలు, జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి - కేంద్ర మంత్రులను కోరిన ఎర్రం మహేష్

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 5:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్మించిన మధ్య మానేరులో సర్వం కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని , ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఇప్పటికీ 25 వేల ఎకరాల భూమి తీసుకొని 12,500 కుటుంబాలను ప్రభుత్వం రోడ్డున పడేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్ తెలిపారు . వేములవాడ నియోజకవర్గంలో నెలకొని ఉన్న పలు సమస్యలు , చెప్పట్టవల్సిన అభివృద్ధి పనులపై గురువారం రోజున బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కేంద్ర మంత్రులు జి . కిషన్ రెడ్డి , అర్జున్ రావు మేఘవాలలను ఎర్రం మహేష్ కలసి పలు విషయాలు చర్చించారు . మిడ్ మానేరులో కోల్పోయిన భూములు , ఇండ్లకు నేటికి కూడా పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించలేదని , భూ నిర్వాసితులు ఉపాధి కొరకు గడిచిన ఐదు సంవత్సరాలు ఇండస్ట్రియల్ కారిడార్ మంజూరు చేసి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్

ఏర్పాటు చేసి ఇండస్ట్రియల్ బ్యాంక్ పెట్టి ఉపాధి మార్గము కొరకు సహకరించమని సిఎంను , మంత్రులను , స్థానిక ఎమ్మెల్యే పై ఎంత ఒత్తిడి తెచ్చిన పట్టించుకోవడం లేదని , అలాగే అప్పటి ప్రభుత్వం 12,500 కుటుంబాలకు ఇందిరా ఆవాస్ యోజన గృహ నిర్మాణ పథకం మంజూరు ఇచ్చినప్పటికీ నేటికీ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాన్ని ఇంప్లిమెంట్ చేయడం లేదని అన్నారు అలాగే దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ ఆలయ అభివృద్ధిలో భాగంగా అనుబంధ దేవాలయం నాంపల్లి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని , వేములవాడ నుంచి నాంపల్లి రోప్ వే , పక్కనే ఉన్న మిడ్ మానేర్ లో బోటింగ్ కు అవకాశం ఉన్నందున టూరిజం స్పాట్ గా గుర్తించాలని కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డిని , కేంద్ర మంత్రి అర్జున్ రావు కోరారు

దళితుల ఓట్లను చీల్చేందుకు బీజేపీ, కాంగ్రెస్ చీకటి ఒప్పందం : మంత్రి హరీష్ రావు

సిద్దిపేట, ఆగష్టు 5:: హుజూరాబాద్ నియోజకవర్గంలోని దళితుల ఓట్లను చీల్చడానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కయ్యాయని, చీకటి ఒప్పందం చేసుకున్నారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. గురువారం హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నేతలు సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. టీఆర్ఎస్ పార్టీని దెబ్బకొట్ట డానికి రెండు పార్టీలు అంతంతంగా కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు. బీజేపీకి అనుకూలంగా మారడం కోసం కాంగ్రెస్ అభ్యర్థిగా వేరే నియోజకవర్గానికి చెందిన ఓ దళిత నాయకుడిని రంగంలోకి దింపడానికి ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. దళిత అభ్యర్థులను బరిలోకి దింపేతే దళిత ఓట్లు చీల్చవచ్చనే దిగజారుడు రాజకీయాలకు తెరదీస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పార్టీ సైతం ఇతర దళిత నేతలను హుజూరా బాద్‌లో పోటీ చేయించాలని చూస్తున్నదని, దీనివల్ల ఈటల రాజేందర్‌కు అనుకూలత ఏర్పడుతుందనే భ్రమలో ఉన్నదని విమర్శి ంచారు. దళితబంధు పథకంతో దళితుల ఓటా టీఆర్ఎస్ వైపే నిలవడం.. ఆ రెండు పార్టీలు జీర్ణించుకోలేక కుట్రలు, కుమ్మక్కులకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు.

ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో చూడగానే పెరిగిన డీజిల్, పెట్రోల్ , గ్యాస్ సిలిండర్ ధరలు గుర్తుకు వచ్చి ఓట్లు పడవనే ఉద్దేశ్యంతో ఈటల రాజేందర్ ప్రచార శైలిని మార్చారని మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మోడీ ఫోటో, బీజేపీ జెండాలను దాచి కేవలం తన ఫోటోను, తన గుర్తును మాత్రమే ప్రచారం చేసుకుంటూ ప్రజలను మభ్యపెడుతున్నాడని ధ్వజమెత్తారు. బీజేపీ పార్టీ తరపున గెలిచిన నియోజకవర్గాల్లో అభివృద్ధి శూన్యమనే విషయం అందరికీ తెలుసన్నారు. బీజేపీ పార్టీపై విశ్వాసం ఉంటే ఇదే ఈటల రాజేందర్ వెళ్లి మోడీ దగ్గర వెయ్యి కోట్ల ప్యాకేజీ తేగలడా అంటూ ప్రశ్నించారు. ఈటల ఎత్తుగడలకు మోసపోయే పరిస్థితి హుజూరాబాద్‌లో లేదన్నారు. ఇప్పటికే పెట్రోల్ ధర రూ.100 దాటిందని, అక్కడ బీజేపీకి ఓటు వేస్తే వచ్చే ఏడాదిలో డీజిల్, పెట్రోల్ ధరలు రూ.200 దాటడం ఖాయమని, గ్యాస్ సిలిండర్ ధర రూ.1500 దాటుతుందని అన్నారు. మోడీ అవలంభిస్తున్న విధానాలతో మన దేశ ఆర్థిక వ్యవస్థ బంగ్లాదేశ్ కంటే బలహీనంగా మారిందన్నారు. అందుకే పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో బీజేపీ పార్టీని బండకేసి కొట్టారని మంత్రి హరీశ్‌రావు గుర్తుచేశారు. రేపు హుజూరాబాద్‌లో కూడా ఇదే సీన్ రిపీట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్‌రాల్డ్ కలమా కె